



www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
18-06-2024
సంపుటి : 01 | సంచిక : 45 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS



## పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకు

### పక్క రాష్ట్ర సీఎం చూసి నేర్చుకో

- ఆరు నెలలైనా కొత్త పింఛన్లు జాడలేదు
- ఏపీలో కొత్త ప్రభుత్వం పెంచిన పింఛన్లు ఇస్తుంది
- రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి పింఛన్లు రావడం లేదు
- ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు

**విశ్వంభర, హైదరాబాద్:**

కాంగ్రెస్ ప్రభుత్వంలో యువత ఆందోళన చెందుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నిరుద్యోగ యువతి, యువకులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ జాడ పత్తా లేదని విమర్శించారు. సోమవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రూప్ పోస్టులు పెంచాలని కోరారు. మిగతా2లో...

## డీజే సిద్ధార్థ్ @డ్రగ్

- డ్రగ్స్ కేసులో అడ్డంగా బుక్క్
- ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకుంటున్నట్లు నిర్ధారణ
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న నార్కోటిక్ బ్యూరో

2



> ప్రస్తుత సంక్షేమపాలనలో ఒకప్రభుత్వాన్ని మరోప్రభుత్వంతో పోల్చిచూడటం సహజమైపోయింది. పలానా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇక్కడ ఎందుకు అమలుచేయటంలేదని అధికారపార్టీని ప్రతిపక్షాలు నిలదీయటం చాలా సహజం. ఇపుడు తెలంగాణాలో అదే జరుగుతోంది. మొన్నటివరకు కాంగ్రెస్, బీజేపీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏపీలో జగన్మోహన్ రెడ్డి అమలుచేస్తున్న పథకాలను చూపించి కేసీఆర్‌ను నిలదీసేవి. ఇపుడు చంద్రబాబునాయుడు చేసిన సంతకాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్, బీజేపీలు రేవంత్ రెడ్డిని నిలదీస్తున్నాయి.

# గురువు గారు.. జర్ర ఆగు!

## రేవంత్‌కు తలనొప్పిగా మారిన చంద్రబాబు?

- ఏపీలో పథకాల అమలులో బాబు దూకుడు
- తెలంగాణలో అమలుకు నోచని హామీలు
- బాబును చూపిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ విమర్శనాస్త్రాలు
- అక్కడ చేస్తున్నారు..? ఇక్కడ ఎందుకు చేయరని నిలదీత!
- కక్కలేని మింగలేని స్థితిలో సీఎం రేవంత్ రెడ్డి తీరు

**విశ్వంభర, హైదరాబాద్ :**

అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు కొన్ని సంక్షేమపథకాల అమలుపై సంతకాలు చేశారు. అందులో మెగా డీఎస్సీ నోటిఫికేషన్, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగుల పెన్షన్లు పెంపు, అనారోగ్యంతో ఉన్న వారికి ఇచ్చే పెన్షన్, కిడ్నీ బాధితుల పెన్షన్ను పెంచుతూ చంద్రబాబు ఫైళ్ళపై సంతకాలు చేశారు. దీన్నిచూపించి తెలంగాణాలో బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు, బీజేపీ ఎంఎల్ఏ మహేశ్వరరెడ్డి ప్రభుత్వంపై పదేపదే విమర్శలు చేస్తున్నారు. ఆర్థికంగా అధ్వాన్నస్థితిలో ఉన్న ఏపీలోనే చంద్రబాబు పెన్షన్లను పెంచుతూ, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఫైళ్ళపై సంతకాలు పెట్టినప్పుడు తెలంగాణలో మాత్రం పెన్షన్లు పెంపు, డీఎస్సీ ప్రకటనను ఎందుకు చేయటంలేదని నిలదీస్తున్నారు. బాధ్యతలు తీసుకున్న తొలిరోజే 16,347 టీచర్ పోస్టుల భర్తీ ఫైలుపై చంద్రబాబు సంతకంచేశారు. ఈఏడాది చివరలోనే అన్నీ పోస్టులను భర్తీ చేసేందుకు వీలుగా డీఎస్సీ పరీక్షల తేదీలను ప్రకటించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

**చంద్రబాబు దూకుడు... రేవంత్ రెడ్డి బేజారు**

ఏపీలో ప్రస్తుతం వృద్ధాప్య పెన్షన్ను రు. 3 వేల నుంచి నెలకు రు. 4 వేలకు పెంచుతూ చంద్రబాబు ఫైలుపై సంతకం చేశారు. అలాగే దివ్యాంగుల పెన్షన్ను నెలకు రూ. 3 వేల నుండి రు. 6 వేలక పెంచే మిగతా2లో...



## త్వరలో జాబ్ క్యాలెండర్ రిలీజ్

- 12 ఏళ్ల తర్వాత గ్రూప్ -1 పరీక్ష నిర్వహిస్తున్నాం
- మేము ఇచ్చిన ప్రతీ హామీకి కట్టుబడి ఉన్నాం
- చంద్రబాబును ఉదాహరణగా తీసుకుంటే మీ పరిస్థితి ఏంటీ..?
- ఏపీ ఆలోచనలు కాదు.. తెలంగాణ ప్రజల ఆలోచనలు అమలు చేస్తాం
- హరీశ్ రావుకు మంత్రి శ్రీధర్ బాబు స్ట్రాంగ్ కౌంటర్



2

## వీడిన సస్పెన్స్.. వయనాడ్‌కు రాహుల్ టాటా

- రాయ్‌బరేలీ స్థానమే ఫిక్స్
- ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రియాంక ఎంట్రీ
- వయనాడ్ ఉప ఎన్నిక బరిలో పోటీ



2

## ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం వార్నింగ్

- విధుల్లో సమయ పాలన పాటించడం లేదని ఆగ్రహం
- లైవ్ లొకేషన్ డిటెక్షన్ అమలు చేయాలని ఆదేశం
- ఆలస్యంగా రావడం, ముందు వెళ్తే ఇకపై వారికి సీఎల్
- ఎండీఓల హెచ్‌ఓడీలు అంటెండెన్స్ బాధ్యతలు
- కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్ర మంత్రిత్వ శాఖ



2

## డార్జిలింగ్‌లో ఘోర రైలు ప్రమాదం

### 15 మంది మృతి, 60 మందికి తీవ్రగాయాలు


- 15 మంది మృతి, 60 మందికి తీవ్రగాయాలు
- కంచన్‌జుంగా ఎక్స్‌ప్రెస్ రైలును వెనక నుంచి ఢీకొట్టిన గూడ్స్ రైలు
- ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు రావడంతోనే ఘటన
- గాల్లోకి లేచిన బోగీ, పట్టాలు తప్పిన ఎక్స్ ప్రెస్ రైలు
- గూడ్స్ రైలు లోకో పైలట్ తప్పిదంతోనే ప్రమాదం




2

## రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు

- ఒకేసారి 28 మందిని ట్రాన్స్‌పర్ చేసిన సర్కార్
- మరికొందరిని డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని ఆదేశం
- అవినీతి నిరోధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా రుతురాజ్
- హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా రాహుల్ హెగ్డే
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా హర్షవర్ధన్
- యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా సాయి చైతన్య
- సీఐడీ ఎస్పీగా విశ్వజిత్ కంపాటి




**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు జరిగి రెండు రోజులు గడవక ముందే భారీగా ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. ఒకేసారి 28 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్‌లను ఇంతే భారీ స్థాయిలో ట్రాన్స్‌పర్ చేసింది. అలాగే కొంతమంది కలెక్టర్లకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టగా.. తాజాగా ఐపీఎస్‌ల్లోనూ అదే విధానాన్ని మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹139 | ₹161 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹233 | ₹266 |

## ఖైరతాబాద్ బడా గణేష్@70

- ఈసారి 70 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహం
- గత ఏడాది కంటే 7 అడుగులు ఎక్కువ
- మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న నిర్వాహకులు
- ఘనంగా కర్ర పూజ కార్యక్రమం

**విశ్వంభర, హైదరాబాద్:**

వినాయక చవితి అంటే తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుర్తుకొచ్చేది ఖైరతాబాద్ బడా గణేష్. ప్రతీయేటా ఖైరతాబాద్ గణపతి నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇక్కడ కొలువుదీరే భారీ గణపతిని దర్శించుకొనేందుకు లక్షలాది మంది ప్రజలు తరలివస్తుంటారు. మిగతా2లో...


(ఫైల్ ఫోటో)



## హైదరాబాద్‌లో భారీ వర్షం

- ఉరుములు, మెరుపులతో జడివాన
- ఈదురుగాలుల ధాటికి విరిగిపడిన చెట్లు

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో నగరంలో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వర్షపు నీరు రోడ్లకు మీదకు చేరడంతో సిటీలో కిలో మీటర్ల మేర వెహికల్స్ నిలిచిపోవడంతో వాహనదారులు మిగతా2లో...

## తెలంగాణ గవర్నర్‌గా మాజీ సీఎం?

- నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ఇవ్వనున్నట్లు టాక్
- కీలక పదవిని కట్టబెట్టే యోచనలో బీజేపీ అధిష్ఠానం



2

## మీరు సకాలంలో స్పందించడం వల్లే తల్లీబిడ్డ క్షేమం

- విధి నిర్వహణలో మీరు అలాగే మంచి తీసుకురావాలి
- ఆర్టీసీ మహిళ సిబ్బందికి సీఎం అభినందనలు



2

## ..వయనాడ్‌కు రాహుల్ టాటా

**విశ్వంభర, వయనాడ్:** గత కొన్ని రోజులుగా సాగుతున్న సస్పెన్స్‌కు నేటితో తెరపడింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ నుంచి బరిలోకి దిగిన రాహుల్ గాంధీ.. రెండు స్థానాల్లోనూ 3 లక్షలకు పైగా భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ క్రమంలోనే రెండు స్థానాల్లో ఎంపీగా కొనసాగడానికి వీలు లేదు కాబట్టి.. ఏ స్థానాన్ని వదులుకోవాలా అని ఇన్ని రోజులు రాహుల్ గాంధీ తీవ్రంగా ఆలోచించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా సోమవారం వయనాడ్ స్థానానికి గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్లు రాహుల్ ప్రకటించారు. ఇక ఖాళీ కానున్న వయనాడ్ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికలో తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాను బరిలోకి దించనున్నట్లు రాహుల్ గాంధీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీంతో ప్రియాంకా గాంధీ ప్రత్యక్ష రాజకీయ అరంగేట్రానికి సమయం వచ్చేసింది.

**వాయనాడ్ వాదులుకోవడం కష్టమైన పని**

ఈ క్రమంలోనే తన తల్లి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ అధ్యక్షురాలు సోనియా గాంధీ కంచుకోటగా ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానంలోనే తాను ఎంపీగా కొనసాగనున్నట్లు తాజాగా వెల్లడించారు. అయితే వయనాడ్ నియోజకవర్గాన్ని వదులుకోవాలని తాను ఈ నిర్ణయం తీసుకోవడం చాలా కష్టమైన పని అని పేర్కొన్నారు. 2019, 2024 ఎన్నికల్లో భారీ మెజార్టీతో వయనాడ్ ప్రజలు తనను గెలిపించారని.. ఇప్పుడు ఆ స్థానాన్ని వదులుకోవడం చాలా కఠినమైన నిర్ణయం అని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఏఐసీసీలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాహుల్ గాంధీ.. వయనాడ్ స్థానాన్ని వదులుకోవడానికి తాను ఎంతో మదనపడ్డానని, అక్కడి ప్రజలతో తన బంధం భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తన సిట్టింగ్ స్థానమైన కేరళలోని వయనాడ్‌లో వరుసగా రెండోసారి రాహుల్ గాంధీ జయకేతనం ఎగురవేశారు. సీపీఐ అభ్యర్థి అనీ రాజాపై 3.64 లక్షల ఓట్ల భారీ తేడాతో గెలుపొందారు. బీజేపీ తరపున పోటీ చేసిన కె.సురేంద్రన్ మూడో స్థానానికే పరిమితం అయ్యారు. మరోవైపు.. ఇదే ఎన్నికల్లో రాయ్‌బరేలీలో బీజేపీ నేత దినేశ్ ప్రతాప్ సింగ్‌పై 3.88 లక్షల ఓట్ల మెజార్టీతో రాహుల్ గాంధీ ఘన విజయం సాధించారు. 2019 లో ఇదే స్థానంలో సోనియా గాంధీ సాధించిన మెజార్టీని రాహుల్ గాంధీ దాటేయడం విశేషం.



## పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు గ్రూప్ విద్యార్థులు పోస్టులు పెంచాలని కోరితే స్పందించడం లేదన్నారు.

**బీఆర్ఎస్ హయాంలో క్రమం తప్పకుండా పిన్షన్లు**

గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో పాస్ అయిన విద్యార్థులకు 1:50 కాకుండా 1:100 చొప్పున మెయిన్స్ ఎగ్జామ్‌కు అవకాశమివ్వాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. తద్వారా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 1:100 విధానం అమలు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యుతను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని అభ్యర్థులు బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. గ్రూప్స్ పరీక్షలకు మధ్య వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలయిందని, ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని విమర్శించారు. పించన్ ఎప్పుడిస్తరని అవ్వతాతలు అడుగుతున్నారని చెప్పారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా పెన్షన్ వచ్చేందని అంటున్నారని తెలిపారు. రెండు నెలల నుంచి ఆసరా పింఛన్ రావడం లేదని వెల్లడించారు. అవ్వతాతలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న పింఛన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో తీసుకున్న ఆరు గ్యారంటీల దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు.

**ఏపీ సీఎంను చూసి నేర్చుకో..**

ప్రజాపాలన ఆచరణలో ఏమైందన్నారు. పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకని నిలదీశారు. ఏపీ సీఎం మొదటి సంతకంతో పింఛన్ రూ.4 వేలకు పెంచారని, మీరు ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలన్నారు. పక్కన ఆంధ్రప్రదేశ్ ఇచ్చినప్పుడు మీరెందుకు ఇవ్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వికలాంగులకు రూ.6 వేల పింఛన్ వెంటనే ఇవ్వాలన్నారు. చేనేత, గీత కార్మికులకు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ పేషెంట్లకు బీఆర్ఎస్ హాయంలో పెద్ద ఎత్తున పింఛన్ ఇచ్చామని చెప్పారు. ఇంటికి రెండు పింఛన్లు ఇస్తామన్నారని గుర్తుచేశారు. ఉద్యోగులకు ప్రతి నెల 1న జీతాలు ఇస్తే ఆశా వర్కర్లు ఎందుకు వైద్యవిధాన పరిషత్‌కు వస్తారని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ఎం కింద 17 వేల మంది పనిచేస్తున్నారని, వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు నెలల నుంచి సఫాయి కార్మికులకు ఎందుకు వేతనాలు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. వెంటనే గ్రామపంచాయతీయలకు నిధులు విడుదల చేయాలన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులపై కేసీఆర్ బొమ్మ ఉందని ఇవ్వట్లేదని, 1.5 లక్షల మంది చెక్కుల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు రోడ్లు ఎక్కుతున్నారని, 60 వేల మంది జీతాల కోసం వేచిచూస్తున్నారన్నారు. తమ హయాంలో వారికి జీతాలు ఆపలేదని హరీష్ రావు అన్నారు.

## తెలంగాణ గవర్నర్‌గా మాజీ సీఎం?

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా పనిచేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని తెలంగాణ గవర్నర్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఆయన బీజేపీ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థిగా రాజంపేట నుంచి ఆయన పోటీ చేశారు. అయితే ఆయన ఓడిపోవడంతో బీజేపీ హైకమాండ్ ఆయనకు కీలక పదవిని కట్టబెట్టే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ రాజకీయాలపై పూర్తి అవగాహన ఉన్న ఆయనను గవర్నర్‌గా నియమిస్తే తమకు కలిసి వస్తుందని బీజేపీ హై కమాండ్ భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కిరణ్ కుమార్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా రికార్డులకు ఎక్కారు. 2009లో వై.యస్.రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత అప్పటి కాంగ్రెస్ హై కమాండ్ రోశయ్యను సీఎంగా చేసింది. అప్పట్లో కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఏపీ శాసన సభ స్పీకర్‌గా వ్యవహరించారు. రోశయ్య సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ఇక్కడ కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్పటి వరకు స్పీకర్‌గా, చీఫ్ విప్‌గా పనిచేసిన కిరణ్ కుమార్ రెడ్డిని ఎలాంటి మంత్రి పదవిని అనుభవం లేకున్నప్పటికీ అనూహ్యంగా ముఖ్యమంత్రిని చేసింది. ఆంధ్ర ప్రదేశ్ విభజన విషయంలో కాంగ్రెస్ హైకమాండ్‌తో ఆయన చివరి వరకు పోరాడారు. ఫలితం లేకపోవడంతో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత సొంతంగా జై సమైఖ్యాంధ్ర పార్టీ స్థాపించి 2014 ఎన్నికల్లో పోటీ చేసిన పెద్దగా ప్రభావం చూపించలేదు. అయితే, అప్పట్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన కిరణ్ కుమార్ రెడ్డిని రాష్ట్ర గవర్నర్‌గా నియమిస్తే ప్రజలు ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

## రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

పాటించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాత్కాలికంగా ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ చేపట్టింది. ఆ తర్వాత రాష్ట్రంలో సార్వత్రిక ఎలక్షన్ కోడ్ అమలు కావడంతో బదిలీ ప్రక్రియను నిలిపివేసింది. ఎన్నికలు ముగిసినందున పాలనాపరమైన ప్రక్షాళనలో భాగంగా భారీ ఎత్తున ఐపీఎస్‌లకు స్థానచలనం కల్పించింది. పలువురు అధికారుల్ని డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించింది. అవినీతి నిరోధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా రుతురాజ్, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా రాహుల్ హెగ్డే, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా హర్షవర్ధన్, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా సాయి చైతన్య, సీఐడీ ఎస్పీగా విశ్వజిత్ కంపాటి, హైదరాబాద్ నార్త్‌జోన్ డీసీపీగా సాధన రష్మి పెరుమాళ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. శంషాబాద్ డీసీపీగా బి.రాజేశ్, బాలానగర్ డీసీపీగా కె.సురేశ్ కుమార్, మేడ్చల్ జోన్ డీసీపీగా ఎన్.కోటిరెడ్డి, రైల్వేస్ ఎస్పీగా చందన దీప్తిని నియమించారు.

| ఐపీఎస్ అధికారి పేరు | బదిలీ అయిన స్థానం |
|---|---|
| 1. అశోక్ కుమార్ | జగిత్యాల ఎస్పీ |
| 2. సన్ ప్రీత్ సింగ్ | సూర్యాపేట ఎస్పీ |
| 3. రాహుల్ హెగ్డే | హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ |
| 4. ఎల్.సుబ్బారాయుడు | డీజీపీ కార్యాలయం |
| 5. టి.శ్రీనివాసరావు | జోగులాంబ గద్వాల్ ఎస్పీ |
| 6. రితిరాజ్ | ఏసీబీ జాయింట్ డైరెక్టర్ |
| 7. డీవీ శ్రీనివాసరావు | కొమురంభీం ఆసిఫాబాద్ ఎస్పీ |
| 8. కె.సురేశ్ కుమార్ | బాలానగర్ డీసీపీ |
| 9. జానకి ధరావత్ | మహబూబ్ నగర్ ఎస్పీ |
| 10. హర్షవర్ధన్ | సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ |
| 11. విశ్వజిత్ కంపాటి | సీఐడీ ఎస్పీ |
| 12. బి.రాజేశ్ | శంషాబాద్ డీసీపీ |
| 13. కె.నారాయణరెడ్డి | వికారాబాద్ ఎస్పీ |
| 14. ఎన్.కోటిరెడ్డి | మేడ్చల్ జోన్ డీసీపీ |
| 15. నితికా పంత్ | రాష్ట్ర స్పెషల్ పోలీస్ 2వ బెటాలియన్ కమాండెంట్ |
| 16. పీజేపీసీ ఛటర్జీ | రాష్ట్ర స్పెషల్ పోలీస్ 2వ బెటాలియన్ కమాండెంట్ |
| 17. శరత్ చంద్ర పవార్ | నల్గొండ ఎస్పీ |
| 18. చందన దీప్తి | రైల్వేస్ ఎస్పీ (సికింద్రాబాద్) |
| 19. షేక్ సలీమా | వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ |
| 20. ఎంఏ బారీ | డీజీపీ కార్యాలయం |
| 21. పాటిల్ సంగ్రామ్ సింగ్ | సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ |
| 22. పి.సాయి చైతన్య | యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్పీ |
| 23. సాధనా రష్మి పెరుమాళ్ | హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ |
| 24. రోహిణి ప్రియదర్శిని | డిచ్ పల్లి 7వ బెటాలియన్ కమాండెంట్ |
| 25. బి.రామ్ ప్రకాశ్ | డీజీపీ కార్యాలయం |
| 26. బి.రాజమహేంద్ర నాయక్ | జనగామ వెస్ట్ జోన్ డీసీపీ |
| 27. పి.సీతారామ్ | డీజీపీ కార్యాలయం |
| 28. ఏ.భాస్కర్ | మంచిర్యాల్ డీసీపీ |

## ఖైరతాబాద్ బడా గణేష్@70

(మొదటి పేజీ తరువాయి)

అనేక ప్రత్యేకతలతో ఖైరతాబాద్ మహాగణపతి భక్తులను దర్శనమిస్తారు. ఈసారి ఎన్ని అడుగుల్లో దర్శనమివ్వనున్నారు.. ఏ అవతారంలో కనువిందు చేయనున్నారనే దానిపైనే అందరి ఫోకస్ ఉంటుంది. భక్తులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఖైరతాబాద్ మహా గణపతి విగ్రహం నమూనా వచ్చేసింది. గతేడాదే ఖైరతాబాద్ గణపయ్య 63 అడుగుల ఎత్తులో ఉండి ప్రపంచ రికార్డు కూడా సృష్టించాడు. తన రికార్డును మళ్లీ తానే బ్రేక్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు ఖైరతాబాద్ గణనాథుడు. ఏడాది 70 అడుగుల మట్టి విగ్రహాన్ని రూపొందించేందుకు ఖైరతాబాద్ గణేశ్ మండలి నిర్వాహకులు సిద్ధం అయ్యారు. ఈ హైట్‌తో ఖైరతాబాద్ గణేషుడు తన పేరు మీదున్న రికార్డును తానే బ్రేక్ చేసేందుకు సిద్ధమవుతున్నాడు.

**తొలి పూజ ప్రారంభం**

ప్రతి సంవత్సరం నిర్మల ఏకాదశి రోజున ఖైరతాబాద్ గణపతి ఉత్సవ కమిటీ సోమవారం కర్ర పూజ నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా గణపతి విగ్రహ ఎత్తు 70 అడుగులుగా నిర్ణయించారు. 11 రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం అన్నారు. పర్యావరణానికి ఎలాంటి హాని తలపెట్టకుండా.. పర్యవరణహిత విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో కంటే మెరుగ్గా ఉత్సవాలను నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. వచ్చిన ప్రతీ భక్తుడికి ప్రసాదం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాగేందర్ వివరించారు. దీనికి సంబంధించి అన్ని విభాగాలను సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ ఏర్పాటు చేస్తామని దానం నాగేందర్ స్పష్టం చేశారు. 1954 నుంచి అంటే సుమారు 65 ఏళ్ల నుంచి ఖైరతాబాద్‌లో వినాయకుడ్ని ప్రతిష్టిస్తున్నారు. 1954లో సింగరి శంకరయ్య అనే స్థానిక భక్తుడు స్థానిక ఆలయంలో ఒక అడుగు ఎత్తున్న గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించాడు. అలా.. 2014 వరకు ప్రతి ఏటా ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ విగ్రహాన్ని తయారు చేశారు.



(ఫైల్ ఫొటో)

## గురువు గారు.. జర్ర ఆగు..!

(మొదటి పేజీ తరువాయి)



ఫైలుపై సంతకంచేశారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి ఇప్పుడిస్తున్న పెన్షన్ను రు. 5 వేల నుండి రు. 15 వేలకు పెంచాలని ఆదేశించారు. ఇక కిడ్నీ బాధితులకు ఇస్తున్న పెన్షన్ను రు. 5 వేల నుండి రు. 10 వేలకు పెంచే ఫైలుపైన సంతకం చేశారు. చంద్రబాబు సంతకాలు చేసిన మెగా డీఎస్సీ, పెన్షన్లు పెంచే సంక్షేమపథకాల ఫైళ్ళని హరీష్ రావు, మహేశ్వరరెడ్డి చూపించి రేవంత్ పై విమర్శలు చేస్తున్నారు. హరీష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 191 రోజులు అవుతున్నా ఇంతవరకు డీఎస్సీ ప్రకటన, పింఛన్ల పెంపు ఎందుకు చేయలేదని రేవంత్ ను నిలదీశారు. అధికారంలోకి వచ్చిన నూరురోజుల్లోనే పెన్షన్స్ పెంచుతామని, డీఎస్సీ ప్రకటిస్తామన్న రేవంత్ మాటలన్నీ అబద్ధాలే అని హరీష్ మండిపడ్డారు. బీజేపీ ఎంఎల్ఏ మహేశ్వరరెడ్డి కూడా ఇవే అంశాలపై రేవంత్‌ను వాయించేశారు.

**అప్పులు ఉన్నా అమలు చేయాల్సిందే..**

తాజాగా రేవంత్‌కు సమస్య ఎక్కడ వచ్చిందంటే రెండు రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి దాదాపు ఒకేలాగుంది. రెండు ప్రభుత్వాలూ లోటు బడ్జెట్లోనే ఉన్నాయి. రెండు ప్రభుత్వాల నెత్తిన లక్షల కోట్ల రూపాయల అప్పులున్నాయి. అప్పులు చేయందే రోజుగడిచే పరిస్థితి రెండు ప్రభుత్వాలకు లేదు. ఏపీకి తెలంగాణాకు పెద్ద తేడా ఏమిటంటే ఆదాయంలో అతిపెద్ద వనరు హైదరాబాద్. తెలంగాణ మొత్తం నుండి వస్తున్న పన్నుఆదాయంలో సగానికి మించి హైదరాబాద్ రాజధాని నుండే వస్తోంది. ఈ వెసులుబాటు ఏపీకి లేదు. ఏపీలో కూడా వైజాగ్ అతిపెద్ద నగరమే అయినా హైదరాబాద్ అంత కాదు కాబట్టి పన్ను ఆదాయం కూడా అంతరాదు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే ఇచ్చిన హామీల అమలులో చంద్రబాబును చూపించి తెలంగాణాలో ప్రతిపక్షాలు నిలదీస్తుండటం రేవంత్‌కు పెద్ద తలనొప్పిగా తయారైందనే అనుకోవాలి. మరి హామీల అమలులో రేవంత్ ఏమిచేస్తారో చూడాలి.

## డీజే సిద్ధార్థ్ @ డ్రగ్

**విశ్వంభర, హైదరాబాద్:** డ్రగ్స్ కేసులో డీజే సిద్ధార్థ్ అడ్డంగా దొరికిపోయాడు. కొంతకాలం నుంచి సిద్ధార్థ్ పెద్ద మొత్తంలో ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకుంటున్నట్లు నార్కోటిక్ బ్యూరో పోలీసులు గుర్తించారు. ఆయన కదలికలపై పక్కా ఫోకస్ పెట్టి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీజే సిద్ధార్థ్‌తో పాటు మరొక వ్యక్తికి డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారు నార్కోటిక్ బ్యూరో పోలీసులు. మాదాపూర్, గచ్చిబౌలి ఏరియాల్లో నిత్యం పబ్బులకు వెళ్తున్న వారిపై ఫోకస్ పెట్టారు. 16మందిని అదుపులోకి తీసుకుని టెస్ట్ చేయగా ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇందులో ఒకరు డీజే సిద్ధార్థ్, మరొకరు స్వరూప్‌గా గుర్తించారు. కొంతకాలంగా డీజే సిద్ధార్థ్, స్వరూప్ కదలికలపై నార్కోటిక్ పోలీసులు నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిద్ధార్థ్, స్వరూప్‌తోపాటు ఇంకెవరెవరు డ్రగ్ తీసుకున్నారో దర్యాప్తు చేస్తున్నారు. మరి కొంతమంది అనుమానితులపైనా ఫోకస్ పెట్టారు. స్కూల్స్, కాలేజీల్లో డ్రగ్స్ నిర్మూలనపై చర్యలు చేపడుతున్నామని చెప్పారు తెలంగాణ నార్కొటిక్ బ్యూర్ డైరెక్టర్ సందీప్ శాండిల్య. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని...డ్రగ్స్ నిర్మూలనకు మేనేజ్మెంట్లు సహకరించాలని కోరారు. స్కూళ్లల్లో ఒక రిటైర్డ్ పోలీస్‌ను రిక్రూట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. స్టూడెంట్స్ బ్యాగుల్లో ఈసిగరెట్స్, గంజా, లిక్కర్ బాటిల్స్ ఉంటున్నాయని.. ప్రతిరోజూ స్కూల్ బ్యాగులను చెక్ చేయాల్సిందేనని చెప్తున్నారు. విద్యాసంస్థల్లో జూనియర్లను కొంతమంది సీనియర్లు డ్రగ్స్ కోసం ఉపయోగించుకుంటున్నట్టు తమ దృష్టికొచ్చిందని.. అలర్ట్‌గా ఉండాలని యాజమాన్యాలను ఆదేశించారు.



## త్వరలో జాబ్ క్యాలెండర్ రిలీజ్



**విశ్వంభర, హైదరాబాద్:** నిరుద్యోగులకు మంత్రి శ్రీధర్ బాబు గుడ్ న్యూస్ చెప్పారు. జాబ్, క్యాలెండర్ విడుదలపై ఆయన కీలక ప్రకటన చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో నిరుద్యోగులకు హామీ ఇచ్చినట్లుగా త్వరలోనే జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని ప్రకటించారు. 12 ఏళ్ల తర్వాత గ్రూప్ 1 పరీక్ష కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్వహించిందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఎలక్షన్ కోడ్ వచ్చి మొన్ననే ముగసిందని, కోడ్ ముగియడంతో ఇచ్చిన హామీల అమలు ప్రక్రియ స్టార్ట్ చేస్తామని స్పష్టం చేశారు. ఇక, సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబును చూసి నేర్చుకోవాలన్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్కు శ్రీధర్ బాబు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మేము చెప్పిన ప్రతీ మాటకు కట్టుబడి ఉన్నామని, మీరు వదిలిన అస్తవ్యస్థ ఆర్థిక వ్యవస్థను సెట్ చేస్తున్నామని రివర్స్ కౌంటర్ ఇచ్చారు. చంద్రబాబును ఉదాహరణగా తీసుకున్నారంటే హరీష్‌రావు పరిస్థితి ఏంటో అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. మేం తెలంగాణ ప్రజల ఆలోచనలను అమలు చేస్తామని, ఏపీ ఆలోచనలు కాదని కౌంటర్ ఇచ్చారు. ఆశా వర్కర్ల గురించి మాట్లాడే హక్కు హరీష్ రావుకు లేదని.. వాళ్ల హయాంలో గుర్రాలతో ఆశ వర్కర్స్ను తొక్కించారని గుర్తుచేశారు. పెద్దపల్లి ఘటనపై విచారణ జరుగుతుందని తెలిపారు. మైనర్ బాలికపై అత్యాచారం జరగడం దురదృష్టకరమని అన్నారు. శాంతి భద్రత విషయంలో మా ప్రభుత్వం సీరియస్ గా ఉందని తేల్చి చెప్పారు. మతఘర్షణల విషయంలో సీరియస్ ఉన్నామని.. మెదక్ అల్లర్ల ఘటన వెనక ఎవరి హస్తం ఉన్న ఉక్కు పాదంతో అణిచివేస్తామని స్పష్టం చేశారు.



## హైదరాబాద్‌లో భారీ వర్షం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షం కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అత్యవసరమైతేనే ఇండ్ల నుండి బయటకు రావాలని ప్రజలను అధికారులు అలర్ట్ చేశారు. మరోవైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులకు కాస్త ఉపశమనం కలిగింది. హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. నగరంలోని ఖైరతాబాద్, కూకట్ పల్లి, రాజేంద్ర నగర్, అత్తాపూర్, బంజారాహిల్స్ సహా పలుప్రాంతాల్లో వర్షం కురిసింది. కొద్దిపాటి వర్షానికే నీరంతా రోడ్లపైకి వచ్చి చేరడంతో పలుచోట్ల వాహనదారులు ఇబ్బందిపడ్డారు. వర్షానికి ఎక్కడా జనం ఇబ్బంది పడకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎక్కడా నీళ్లు నిలిచిపోకుండా, డ్రైనేజ్ పొంగిపొర్లిన చోట ప్రజలకు ఇబ్బంది లేకుండా బల్దియా సిబ్బంది చర్యలు చేపట్టారు.

**టోలిచౌకిలో కూలిన భారీ చెట్టు**

హైదరాబాద్ నగరంలో భారీగా కురిసిన వానతో నగరవాసులు తడిసిముద్దయ్యారు. ఈదురు గాలులు, ఉరుములతో కురిసిన వర్షానికి వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బలమైన గాలుల ధాటికి కొన్ని చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. టోలిచౌక్ గోల్కొండ ఎండి లైన్స్‌లోని ఈదురు గాలులతో 200 సంత్సరాల నాటి చెట్టు నేలకొరిగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తలకు గాయాలు కాగా, 4 బైక్స్ ధ్వంసమయ్యాయి. దీంతో అప్రమత్తమైన జీహెచ్ఎంసీ విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి.

## మీరు సకాలంలో స్పందించడం వల్లే
## తల్లీబిడ్డ క్షేమం

- విధి నిర్వహణలో మీరు అలాగే మంచి తీసుకురావాలి
- కరీంనగర్ డిపో ఆర్టీసీ మహిళ సిబ్బందికి సీఎం అభినందనలు

**విశ్వంభర, హైదరాబాద్ :** కరీంనగర్ బస్టాండ్ లో చీరలను అడ్డుగా కట్టి ఓ గర్భిణీకి ఆర్టీసీ సిబ్బంది డెలివరీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన పై సీఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. కరీంనగర్ బస్ స్టేషన్ లో గర్భినీకి కాన్పు చేసి మానవత్వం చాటుకున్న టీజీఎస్ ఆర్టీసీ సిబ్బందికి నా అభినందనలు. మీరు సకాలంలో స్పందించడం వల్ల తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. విధి నిర్వహణలో కూడా మీరు అలాగే మంచి తీసుకురావాలని ఆశిస్తున్నానని తెలిపారు. మరోవైపు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కూడా ఈ ఘటన పై స్పందించారు. పరిమళించిన మానవత్వంపై తాజాగా ట్వీట్ చేశారు. కరీంనగర్ బస్ స్టేషన్ లో నిండు చూలాలికీ కాన్పు చేసిన టీజీఎస్ ఆర్టీసీ మహిళా సిబ్బంది మానవత్వం అభినందనీయమన్నారు. మీరు సకాలంలో స్పందించి డెలివరీ చేయడం వల్లనే తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. మానవత్వం చాటుకోవడంలో ఆర్టీసీ ముందుంటుందని సిబ్బంది మరోసారి నిరూపించారని హర్షం వ్యక్తం చేశారు.





# ‘ఆనంద ఆహారం’ మెనూ చూస్తేనే నోరూరుతుంది

## మంత్రి కోమటిరెడ్డి

**విశ్వంభర, నల్లగొండ :** నిరుద్యోగులు ఉద్యోగాలే పరమవది అని ఎదురు చూడకుండా బిజినెస్‌లు స్థాపించి యువతకు ఆదర్శంగా నిలవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ రూరల్ పరిధి చర్లపల్లి హైవేపై ‘ఆ ఆనందం ఆహారం’ ఫ్యామిలీ రెస్టారెంట్, దాబాను ప్రారంభించి మాట్లాడారు. ఆ ఆనంద ఆహారం రెస్టారెంట్ రుచికి, శుచికి, నాణ్యతకు మారుపేరుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ రెస్టారెంట్ మెనూ చూస్తేనే నోరూరుతుందని అన్నారు. నల్లగొండ జిల్లా భోజన ప్రియులకు కమ్మనైన వంటకాలను అందించేందుకు రెస్టారెంట్‌ను నెలకొల్పిన కాచం సంతోష్, జిల్లా సాయి లక్ష్మణ్‌ను మంత్రి అభినందించారు. వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిన చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ యువత తలుచుకుంటే ఏ రంగంలోనైనా రాణిస్తారని అన్నారు. కృషి, పట్టుదల ఉంటే విజయాలు దాసోహం అవుతాయని తెలిపారు. నార్కెట్ పల్లి - అద్దంకి హైవేపై ఏపీ, తెలంగాణ భోజన ప్రియులకు రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్న యువకులను ఆయన ప్రోత్సహించారు. ఆనంద ఆహారం విజయవంతంగా మరిన్ని బ్రాంచీలను ప్రారంభించాలని కాచం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, సీనియర్ జర్నలిస్ట్ కోటగిరి దైవదినం, మున్సిపల్ కౌన్సిలర్లు బొజ్జ శంకర్, ఏర్పుల దర్శన రవికుమార్, భీష్మారెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు కాచం శంకర్, కాచం సాయి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డితో సహా 12 మందికి హైకోర్టు నోటీసులు



**విశ్వంభర, చిత్తూరు :** మాజీ మంత్రి వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు 12 మంది అనుచరులు తనపై దాడి చేసి, తప్పుడు కేసులు నమోదు చేశారని, మాజీ జడ్జి రామకృష్ణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు పెద్దిరెడ్డి, తంబల్లిపల్లి ఎమ్మెల్యే ద్వారకానాథ్ రెడ్డితో సహా 12 మందికి వారంలోపు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. రామకృష్ణ చేసిన ఫిర్యాదుల పై రిపోర్టును సమర్పించాలని అన్నమయ్య ఎస్పీని కూడా ఆదేశించింది. ఈ నేపథ్యంలో మాజీ జడ్జి రామకృష్ణ మాట్లాడుతూ ”ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు దౌర్జన్యాలు, దుర్మార్గాలు, అవినీతికి పాల్పడ్డారు అని అన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారి కుటుంబాలపై గంజాయి, రౌడీ మూకలను ప్రేరేపించి దాడులకు పాల్పడ్డారు. తనకున్న అధికారాన్ని అడ్డుపెట్టుకుని పోలీసుల ద్వారా బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టించి జైల్లో పెట్టించారు. పెద్దిరెడ్డి దుర్మార్గపు చర్యలకు అఘాత్యాలకు మూల్యం చెల్లించుకునే రోజు దగ్గర్లో ఉంది. ” అని హెచ్చరించారు.

## శ్రీవారి భక్తులకు శుభవార్త

### నేటి నుంచే ఆర్జిత సేవల కోటా టికెట్లు విడుదల



**విశ్వంభర, తిరుపతి:** శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం శుభవార్త చెప్పింది. సెప్టెంబర్ నెలకు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్ల కోటాను టీటీడీ మంగళవారం నుంచి విడుదల చేయనున్నది. సుప్రభాతం, తోమాల సేవ, అర్చన, అష్టదళ పాద పద్మారాధన సేవల టికెట్లను ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా కేటాయించనున్నది. ఇందుకు ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి 20న ఉదయం 10 గంటలకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంటుంది. ఈ మూడురోజుల్లో తమ వివరాలు నమోదు చేసుకున్న భక్తులకు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా పలు ఆర్జిత సేవల టికెట్లను టీటీడీ కేటాయించనున్నది. ఎలక్ట్రానిక్ డిప్‌లో ఆర్జిత సేవా టికెట్లు పొందిన భక్తులు ఈ నెల 20 మధ్యాహ్నం 12 గంటల నుంచి 22న మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్దేశిత నగదు చెల్లించి టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక కల్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, దీపాలంకార సేవ టికెట్లను ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నది. కల్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, దీపాలంకార సేవల్లో వర్చువల్‌గా పాల్గొనే భక్తుల కోసం ఈ నెల 21 మధ్యాహ్నం 3 గంటలకు కోటా విడుదల చేయనున్నారు. అంగప్రదక్షిణం టికెట్లను 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజున మధ్యాహ్నం 3 గంటలకు సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు ప్రత్యేక ప్రవేశ దర్శనం కోసం టికెట్లు విడుదల చేయనున్నది. రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను 24న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నది. తిరుపతి, తిరుమలలో వసతి గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు కోటా విడుదల చేయనున్నది.

ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో ttdevasthanams.ap.gov.in ద్వారా బుక్ చేసుకోవాలని టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.




## ఈ నెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

- జూన్ 24 నుంచి 26 వరకు సమావేశాలు
- జూన్ 24న ప్రొటెం స్పీకర్ ఎన్నిక
- నూతన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించనున్న గవర్నర్

**విశ్వంభర, విజయవాడ:** ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఏపీ నూతన అసెంబ్లీ తొలిసారి సమావేశం కానుంది. జూన్ 24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. జూన్ 26తో ఈ సమావేశాలు ముగుస్తాయి. రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయినందున, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించే కార్యక్రమం జరగాల్సి ఉంది. వాస్తవానికి ఏపీ అసెంబ్లీ సమావేశాలు జూన్ 19 నుంచి నిర్వహించాలని భావించారు. అయితే, గవర్నర్ అబ్దుల్ నజీర్ బక్రీద్ సెలవుల్లో ఉండడంతో, ఏపీ అసెంబ్లీ సమావేశాలను ఈ నెల 24 నుంచి జరపాలని నిర్ణయించారు. ఈ నెల 24న ప్రొటెం స్పీకర్ ను ఎన్నుకుంటారు. అనంతరం కొత్త ఎమ్మెల్యేలతో ఆయన ప్రమాణ స్వీకారం చేయిస్తారు. కాగా, ఏపీ అసెంబ్లీ కొత్త స్పీకర్ అయ్యన్నపాత్రుడు అంటూ వార్తలు ప్రచారంలో ఉన్నాయి. డిప్యూటీ స్పీకర్ పదవి జనసేనకు ఇస్తారని కూడా కథనాలు వస్తున్నాయి. వీటిపై కూటమి నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు.



## సోనియా, రాహుల్, ప్రియాంకలతో షర్మిల భేటీ

**విశ్వంభర, ఢిల్లీ:** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేడు ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ, కాంగ్రెప్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలను కలిశారు. ఈ భేటీ సోనియా నివాసంలో జరిగింది. ఈ సమావేశంపై షర్మిల ట్వీట్ చేశారు. “సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఢిల్లీలోని వారి నివాసంలో కలిశాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తదుపరి కార్యాచరణకు సంబంధించి ఆసక్తికరమైన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా... భవిష్యత్ ప్రణాళికలు, కార్యాచరణ తీరుతెన్నులు, ఇతర అంశాలపై నిర్మాణాత్మకమైన చర్చ జరిగింది. రాబోయే రోజుల్లో ఏపీలో కాంగ్రెస్ పార్టీ పునర్ వైభవం సంపాదించుకోవడమే కాదు ఒక బలీయమైన శక్తిగా అవతరిస్తుంది. ఈ దిశగా మరిన్ని అడుగులు పడనున్నాయన్న విషయం తెలియజేస్తున్నందుకు ఎంతో సంతోషిస్తున్నాను” అని షర్మిల వివరించారు. గాంధీల కుటుంబంతో తన భేటీకి సంబంధించిన ఫొటోను కూడా షర్మిల పంచుకున్నారు.



## నగరవాసులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సూచన

**విశ్వంభర, జూబ్లీహిల్స్ :** హైదరాబాద్‌లోని మాదాపూర్, గచ్చిబౌలి, దుర్గం చెరువు, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, పంజాగుట్ట, యూసుఫ్‌గూడ, బేగంపేట్‌తో పాటు పలు చోట్ల భారీ వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో కురుస్తోన్న భారీ వర్షాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను అడిగి తాజా పరిస్థితుల గురించి అధికారులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సూచనలు చేశారు. భారీ వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దని ఆయన సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు.

## కారును ఢీకొట్టిన పెద్దపులి..

### నుజ్జునుజ్జయిన వాహనం

**విశ్వంభర, నెల్లూరు:** శ్రీపొట్టి శ్రీరాములు జిల్లాలో షాకింగ్ ఇన్సిడెంట్ వెలుగుచూసింది. మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లె సమీపంలో నెల్లూరు-ముంబై హైవేపై వేగంగా ప్రయాణిస్తున్న కారును పెద్దపులి ఒక్కసారిగా ఢీకొట్టింది. ఊహించని ఈ పరిణామంతో అందులోని ప్యాసింజర్స్ కంగుతిన్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. బద్వేలుకు చెందిన ఐదుగురు కారులో నెల్లూరు ప్రయాణిస్తున్నారు. కదిరినాయుడుపల్లె ఫారెస్ట్ ఏరియాలో పెద్దపులి రోడ్డు దాటే క్రమంలో ఒక్కసారిగా కారును ఢీకొట్టింది. కారు వేగంగా వస్తుండటంతో పులిని కొంతదూరం ఈడ్చుకెళ్లింది. అనంతరం డ్రైవర్ శ్రీనివాసులు అలెర్టై సడన్ బ్రేక్ వేశాడు. కారు కొంతదూరం ఈడ్చుకెళ్లడంతో పెద్దపులి కాళ్లకు తీవ్రగాయాలయినట్లు చెబుతున్నారు. ప్రమాదం తర్వాత సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది పులి. ఊహించని ఈ ఘటనతో కారులోని ఐదుగురూ షాక్ తిన్నారు. భయంతో గావు కేకలు పెట్టారు. డోర్లు మొత్తం మూసి ఉండటంతో.. ఎలాంటి హాని వారికి జరగలేదు. ప్రస్తుతం వారంతా సేఫ్‌గానే ఉన్నారు. ఈ ప్రమాదంతో కారు ముందుభాగం ధ్వంసమైంది. స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో.. వారు స్పాట్‌కు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి పరిస్థితిని తెలుసుకునేందుకు ఫారెస్ట్‌లోకి వెళ్లి కూంబింగ్ చేయనున్నట్లు తెలిపారు. పెద్దపులి సంచారం గురించి తెలియడంతో మర్రిపాడు మండలంలోని అటవీప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# విద్యను అంగడి సరుకుగా మారుస్తున్నదెవరు ?

ఈ ప్రపంచ స్థితి... గతిని మార్చడానికి ఉపయోగించే అతి శక్తివంతమైన సాధనం 'విద్య' అని నల్లజాతి ప్రజల సూర్యుడు నెల్సన్ మండేలా పేర్కొన్నారు. మన దేశానికి స్వతంత్రం వచ్చాక దేశ పురోగమనానిరకి, ప్రజల సర్వతోముఖాభివృద్ధికి విద్యను ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగించుకోవడంలో పాలక వర్గాలు సాధించిన విజయాలకన్నా వైఫల్యాలు ఎక్కువగా కనిపిస్తాయి. భారత విద్యా విధానంపై ప్రభుత్వాలు వేసిన అనేక కమిటీలు కూలంకషంగా చర్చించి నివేదికలు ఇచ్చాయి. రాధాకృష్ణన్ కమిటీ నివేదిక (1948), కొఠారి కమిటీ నివేదిక (1966)లు భారత దేశ తొలి అభివృద్ధి దశల్లో విద్యా లక్ష్యాలు, విలువలను గురించి స్పష్టంగా చెప్పాయి. దూరదృష్టితో కూడిన ఈ సిఫార్సులను ప్రభుత్వాలు పూర్తిగా అమలుచేయడంలో విఫలమైనాయి. 1986లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం విద్యారంగాన్ని ముఖ్యంగా ఉన్నత విద్యారంగాన్ని శరవేగంగా ప్రయివేటీకరించింది. ఫలితంగా గడచిన మూడు దశాబ్దాల కాలంలో విద్యారంగం కునారిల్లిపోయింది. అవేంటో నిశితంగా పరిశీలన చేద్దాం.

నాడు ఎంతో పవిత్రంగా భావించి ఆరాధించి పూజించిన విద్య రానురాను అంగడి సరుకుగా మారిపోతున్నది. విద్యనేకాదు విద్యార్థులతో సహా ఏకంగా విద్యాసంస్థలను అమ్ముకునే దుర దృష్టపు రోజులు దాపురించాయి. బాలబాలికలకు పుస్తకాల బరువు, తల్లిదండ్రులకు ధనభారం మోయ లేనంతగా పెరిగిపోతున్నది. విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనంగా విద్యా వ్యాపారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఆమాటకొస్తే దేశవ్యాప్తంగా మూడుపువ్వులు, ఆరు కాయలుగా నడుస్తున్నది అనేది నగ్నసత్యం. రోజురోజుకు ప్రైవేట్ రంగంలో విద్యావ్యాపారం విస్తరించి వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈ వ్యాపారంలో గతంలో ఇతర వ్యాపారాలు చేసేవారు, కాంట్రాక్టర్లు, అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయ నాయకులు నేరుగా భాగస్వాములవుతున్నారు. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రైవేట్ బడులు లేవు. ఎక్కడో పట్టణాల్లో, నగరాల్లో నడిచేవి. వాటిలో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవి కావు, లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవాదృక్పథంతో ఆ విద్యాసంస్థలు సేవలు అందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి బడులు నడిపేవారు. అందువల్ల ఆనాడు ప్రైవేట్ పాఠశాలలను అరికట్టే అవసరం లేకుండా పోయింది. అందుకే చట్టాల అవసరం తలెత్తలేదు. ప్రభుత్వరంగంలో కూడా అంతోఇంతో పటిష్టంగా నడిచేవి. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అసమర్థత, అరకొర నిధులు, అవినీతి, వీటన్నింటిని మించి రాజకీయ జోక్యంతో విద్య నానాటికీ దిగజారిపోతున్నది. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. బీదాబిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లో దొరుకుతుందనే నమ్మకంతో అవైపే మొగ్గుచూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతి లేనివారు మరోదారి లేక విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. కనీస మౌలిక వసతులు లేవు. కేంద్ర విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం భారతదేశంలో 14,89,000 పాఠశాలల్లో ఇరవై ఆరున్నర కోట్ల మంది చదువుకుంటున్నారు. అధిక శాతం పాఠశాలలు రకరకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. పన్నెండువేలకుపైగా ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని అధికారికంగానే కేంద్ర ప్రభుత్వం ఆ మధ్య రాజ్యసభలో వెల్లడించింది. ఐదు లక్షలకు పైగా పాఠశాలల్లో మంచి నీటి వసతి సైతం కరవైంది. విద్యాహక్కు ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించామని చెబుతున్నా అవి వినియోగంలో లేవని భారత్ కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక స్పష్టం చేసింది. ఇలాంటి కారణాలతో ఎందరో ముఖ్యంగా బాలికలు చదువుకు మధ్యలోనే మంగళం పాడుతున్నారని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇక దీనిని ఆసరాగా చేసుకొని ప్రైవేట్ విద్యా వ్యాపారం విస్తరించిపోతున్నది. ఫీజుల వసూళ్లకు అదుపే లేకుండా పోతున్నది. ప్రస్తుతం ఇంటర్మీడియేట్ రెండేళ్లకు ఐదు నుంచి ఇరవై లక్షల వరకు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఎల్కెజి నుంచి రకరకాల




> తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ప్రధానంగా గత ప్రభుత్వం కేజీ టూ పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్య అందిస్తామని, అటెండర్ పిల్లల నుంచి కలెక్టర్ పిల్లల వరకు సర్పంచ్ పిల్లల నుంచి సీఎం పిల్లల వరకు అంతా ఒకే బెంచీ (తరగతి గది)లో చదివేలా 'కామన్ స్కూల్' తీసుకొస్తామన్న మాటలు దశాబ్ద కాలం గడిచినా అమలుకు నోచుకోలేదు. అంగన్వాడీలను సర్కారు బడుల్లో విలీనం చేయకపోగా, 6సం. నిండిన వారినే చేర్చుకోవాలన్న నిబంధనలు శాపంగా మారినాయి. ప్రభుత్వ విద్యను పరిరక్షించడంలో పాలకుల ఉదాసీనతతో ప్రైవేటు విద్యాసంస్థలకు వరంగా మారింది. తల్లి దండ్రులకు స్తోమత లేకపోయినా భారీగా ఫీజులు పెంచినా భరిస్తూ పిల్లలకు పంపుతున్నారు. ఇలా ప్రభుత్వాలు విద్యా పరిరక్షణకు నిధులు పెంచడంలో, ప్రజల్లో నమ్మకం కల్పించడంలో విఫలమయ్యారని విద్యావేత్తలు భావిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ బడుల్లో ఫీజుల మోత ఆకాశాన్ని అంటుచున్నది. ప్లే స్కూల్, ఎల్కేజీ, యూకేజీ మొదటి తరగతి నుంచి పదోతరగతి వరకు డొనేషన్లు, అభివృద్ధి చార్జీలతో పాటు పాఠ్య పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టుల పేరిట తల్లి దండ్రుల జేబులకు భారీగా చిల్లులు పెడుతున్నాయి.

పేర్లతో లక్షలాది రూపాయలు వసూలుచేస్తున్నారు. ఫీజులు పెంచినా కిక్కురుమనకుండా పిల్లలను స్కూల్లో చేర్పిస్తున్నారు. ఇలా చేయడం ప్రైవేట్ స్కూళ్ల యాజామాన్యాలకే బాగా తెలుసు. ఎక్కడ డబ్బులు ఎలా రాబట్టాలో వారికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ప్రభుత్వాలు కూడా ఇంతవరకు వారిని ఏమీ అనడం లేదు. ముక్కుపిండి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా నియంత్రణ లేదు. స్కూళ్ల ప్రారంభానికి ముందే ఫీజులను వసూలు చేసుకున్నారు. కొన్ని స్కూళ్లు ఫీజులను వసూలు చేశాక మెల్లగా నెలాఖరు వరకు ఆన్లైన్ క్లాసులంటూ... విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పారు. బడిబాట పేరుతో ఆర్భాటాలు చేస్తున్న ప్రభుత్వాలు ప్రైవేట్ స్కూళ్లపై నియంత్రణ కోల్పోయాయి. ఎందుకంటే వారిచ్చే ఆమ్యామ్యాలే వారికి ముఖ్యం కనుకవారిపై ఈగ వాలదు. నిజానికి వారు మన చట్టం పరిధిలో ఉన్నారా అన్న అనుమానాలు కూడా కలగమానదు. అయినా ఈ దుర్మార్గపు వ్యాపారానికి అడ్డు కట్టవేయలేకపోతున్నారు. ప్రభుత్వాలు ఏమి చేయడం లేదని చెప్పడం లేదు. ప్రభుత్వ పథకాలు ఆశయాలు కాగితాల వరకు బాగానే ఉంటున్నాయి. ఆచరణకు వచ్చే సరికి అసలు సమస్యలే కారణమవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పరిశీలించినా యేటా వేలాదికోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. అన్నిపాఠ శాలల్లో కలిపి ఒకటో తరగతిలో దాదాపు నలభై లక్షల మందికి పైగా చేరుతున్నారు. వీరిలో యాభై శాతం కూడా ఇంటర్మీడియేట్ దాటి డిగ్రీస్థాయికి చేరుకోలేకపోతున్నారు. రకరకాల కారణాలతో ప్రాథమిక విద్యాస్థాయిలోనే చదువుకు స్వస్తీ చెప్పిన లక్షలాది మంది బాలబాలికలున్నారు. ఇక తెలంగాణ రాష్ట్రం వరకు పరిశీలించినా పదివేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అంచనా. ఈ ఖాళీని దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా బోధనా సిబ్బందిని నియమించినా లక్ష్యా నికి చేరుకోలేకపోతున్నారు. ఏడున్నర దశాబ్దాలు గడిచిపో యినా అందరికి విద్య అందించాలనే లక్ష్యం కనుచూపు మేరలో సాధించే అవకాశాలు కన్పించడం లేదు. దేశాభివృద్ధికే కాదు. మానవ జాతి అభ్యున్నతికి విద్య పునాది అనేది నిర్వివాదాంశం. ఆరేళ్ల నుంచి 14ఏళ్ల బాలబాలికలందరికీ ఉచితవిద్య అందించాలనే కార్యక్రమం పదేళ్లలో పూర్తిచేయాలని స్వాతంత్ర్యం రాగానే పెద్దలు సంకల్పించా రు. ఆ సంకల్పం కాగితాల్లోనే కన్నుమూసింది. కానీ ఆశించిన ఫలితాలు చేకూరలేదు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. బాల బాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యావ్యవస్థను ఇంతటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టడం సమంజసం కాదు.

మరోవైపు యూనిఫాంలు, పుస్తకాలు, బ్యాగుల ధరలను పెంచేస్తున్నాయి. రూ. 250లభించే చిన్నారుల బూట్లకు రూ.700 నుంచి రూ.1000 వరకు, 3జతల యూనీఫామ్లకు రూ.4000లు, టై రూ.250, బెల్ట్ కు రూ.400చొప్పున ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. తల్లిదండ్రులు వేడుకుంటున్నా వినడం లేదు. ప్రత్యేకంగా తయారు చేయించామని పాఠశాల చిహ్నం ఉన్నందున ఇక్కడే కొనుగోలు చేయాలని ఖరాఖండిగా చెప్తు న్నారు. పుస్తకాలు సైతం బయటి మార్కెట్లో కొనడానికి ఒప్పుకోవడం లేదు. తాము చెప్పిన ముద్రణ సంస్థ పుస్తకాలనే కొనాలని అంటున్నాయి. ఇలా పెంచిన ఫీజులు అదనపు బాదుడుతో సామాన్య, మధ్య తరగతుల ప్రజలపై పెను భారం పడుతుంది. కొందరు అప్పులు చేసి మరీ పిల్లల ఫీజు చెల్లిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల పెంపుదలపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం యాజమాన్యాలకు వరంగా మారింది. తల్లి దండ్రులు ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. పాఠశాలల ఫీజుల వసూలు నియంత్రణ చట్టాన్ని తేవాలని 2022 జనవరిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో అప్పటి మంత్రులు 11 మందితో ఉపసంఘం ఏర్పరిచింది. ఆ సిఫారసులు అమలు కాలేదు. కొన్ని పాఠశాలల్లో ప్లే స్కూల్‌కు రూ.2 లక్షలు, ఒకటో తరగతికి రూ.రెండు లక్షల నుంచి రూ.5 లక్షలుగా ఆపై తరగతుల వారిగా పెంచుకుంటూ పోతున్నారు.

అందరికీ ఉచితంగా అందించవలసిన విద్యను వ్యాపారంగా మార్చారు. పాఠశాలకు ఉన్న డిమాండ్‌ను బట్టి ఫీజులను ఇష్టానుసారంగా పెంచేస్తున్నారు. ప్రభుత్వం రుసుములు పెంచడంపై నియంత్రణ పాటించక పోవడం వాటికి అనుకూలంగా మారింది. 2024 25 విద్యా సంవత్సరం నుంచి కొన్ని పాఠశాలలు ఏకంగా 25 శాతం వరకు ఫీజులను పెంచేశాయి. ఇక గ్రామీణ, మున్సిపల్ పట్టణ ప్రాంతాలతో పాటు నగరాల్లో గుర్తింపు, అనుమతి లేని పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వ్యాపారం మొదలు పెట్టారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఏ ఒకటో రెండో బ్రాంచ్లకు అనుమతులు తీసుకొని వేరువేరు చోట్ల అనేక బ్రాంచ్లను నిర్వహిస్తున్నారు. కనీస రక్షణ లేని బహుళ అంతస్తుల భవనాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు. ఎస్టాబ్లిష్ మెంట్ రికగ్నైజేషన్ అడ్మిషన్ అండ కంట్రోల్ ఆఫ్ స్కూల్ అండర్ ప్రైవేట్ మేనే జ్మెంట్ స్కూల్స్ యాక్ట్ 1993 ప్రకారం నివాస భవనాల్లో తరగతులు నిర్వహించకూడదు. తరగతుల నిర్వహణకు అనుమతులు ఇవ్వకూడదు. ఈ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠ శాలలకు ఫైర్ సేఫ్టీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు ఉండవు. విద్యార్థులకు ఆట స్థలం లేకపోవడంతో శారీరక వ్యాయామం, మానసిక వికాసం లేక మెజారిటీ పిల్లలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా సైన్స్ ప్రయోగశాలలు మచ్చుకైనా కనిపించవు. తాగునీరు సైతం విద్యార్థులే సమకూర్చుకోవాల్సి వస్తుంది. ఇక మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపు కొడుతున్నాయి. ఇలా గుర్తింపు, సౌకర్యాలు లేని పాఠశాలను వెంటనే రద్దు చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యాశాఖ అధికారులు హడావుడి చేసి అందిన కాడికి జేబులు నింపుకొని అవినీతికి పరాకాష్టకం మారిన అధికారులు ఆ పాఠశాలల వైపు

కన్నెత్తి చూడకుండానే సిఫారసు చేస్తుంటారు. ఇక ఆ పాఠశాలలు మళ్ళీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోతుంది. కావున ఈ ఫీజుల దోపిడిని ఆపేలా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను వెంటనే కట్టడి చేయాల్సి ఉంది. ఇటు ప్రభుత్వ అటు ప్రైవేట్, కార్పొరేటు విద్య కూడా అర కొర సౌకర్యాలతోనే నడుస్తున్నాయి. కానీ ఫీజులు రాబట్టడంలో మాత్రం జలగల్లా పీక్కు తింటున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వం గతంలో ఇచ్చిన జీవులను పట్టించుకునే నాధుడే కరువాయే జీఓ 42 (30, జూలై 2010) ప్రకారం ఏ పాఠశాలలైనా ఒక వేళ ఫీజులు పెంచాలంటే జిల్లా ఫీజు రెగ్యులరైజేషన్ కమిటీ (డీఎస్ఆర్సి) అనుమతి తీసుకోవాలి. జీఓ 246 ప్రకారం పాఠశాలల నిర్వహణలో సమాజాన్ని భాగస్వామ్యం చేయాలి. సీబీఎస్ చట్టం ప్రకారం ప్రతీ పాఠశాలలో టీచర్స్ అసోసియేషన్లో పేరెంట్ తప్పని సరిగా ఉండాలి. ఫీజులు పెంచే అంశాన్ని వారితో చర్చించాలి.

ఈ జీఓలో ప్రయివేటు పాఠశాలల్లో ఎంత మొత్తంలో ఫీజులు వసూలు చేయాలనేది నిర్ణయించింది. దీని ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అర్బన్ ఏరియాలలో, ఏడాదికి రూ.9వేలు నెలకు రూ.750, రూరల్ ఏరియాల్లో ఏడాదికి రూ.7,800 నెలకు రూ.650 చొప్పున వసూలు చేయాలని, హైస్కూల్ స్థాయిలో అర్బన్ ఏరియాల్లో ఏడాదికి రూ.1200 నెలకు రూ.1000, రూరల్ ఏరియాలలో రూ.10,800, నెలకు రూ.900 చొప్పున వసూలు చేయాలని జీఓ 42లో పేర్కొన్నారు. కానీ దీనికి విరుద్ధంగా కొన్ని ప్రముఖ పాఠశాలల్లో అడ్మిషన్ టెస్టు నిర్వహించటం, ఫీజులు రూ.10, వేల నుండి రూ. 5 లక్షలు వేల వరకూ వసూలు చేస్తున్నారు. దీనిని అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉన్నది. ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఉచిత విద్య చేపడుతూ ఉన్నాయి. మన దేశంలో రాష్ట్రాలలో అందరికీ ఉచిత నాణ్యమైన విద్య అందేలా చూడాలి. తద్వారా ఎదగడానికి సమాన అవకాశాలు కల్పించబడాలి. విద్య వ్యక్తికి వ్యక్తిత్వాన్ని, జీవనోపాధిని కల్పించాలి. సంస్కారవంతంగా తీర్చి దిద్దబడాలి. ప్రభుత్వం ఉదాసీనత వీడనంత కాలం ఇది సాధ్యపడదు. పేదరికం దూరం చేయ నంతవరకు విద్యారంగం ఆశించినంత అభివృద్ధి సాధించలేదు. ఈ విషయంలో నూతనంగా ఏర్ప డిన ప్రభుత్వం అయినా కఠిన చర్యలతో విద్యను ఒకే గొడుగు కిందికి తెచ్చి 'కామన్ స్కూల్' విధా నాన్ని ప్రవేశ పెట్టాలి. ప్రైవేట్ విద్యను పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకోవాలి బడుగు బలహీన వర్గాల పేద పిల్లలకు సంపూర్ణంగా విద్య దొరికే అవకాశం ఉంటుందని ఆశిద్దాం. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన గుణపాఠాలు నేర్చుకోక తప్పదని చెప్పాల్సిన అనివార్యత ప్రస్తుతం నెలకొంది.



- మన్నారం నాగరాజు,
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ,
రాష్ట్ర అధ్యక్షుడు,
95508 44433.

# కేసీఆర్‌ను విచారణకు రప్పించగలరా?

తెలంగాణా రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ సీఎం కాగానే జరిగిన కరెంటు కొనుగోళ్లలో, పవర్ ప్లాంట్ నిర్మాణాల్లో జరిగాయని చెబుతున్న అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ముందుకు గులాబీ పార్టీ బాస్ వెళ్ళలేదు. పైగా కమిషన్ మీదనే ఎదురుదాడి చేశారు. పదేళ్ళపాటు ఎదురులేకుండా పరిపాలించిన, నియంత మాదిరిగా వ్యవహరించి కేసీఆర్ తన హయాంలో జరిగిన కరెంటు కొనుగోళ్లు, విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం విచారణ కమిషన్ వేసేవరకల్లా కోపంతో రగిలిపోతున్నారు.

మేధావినైన తననే ప్రశ్నించడమా అని ఆగ్రహిస్తున్నారు. కరెంటు కొనుగోళ్లపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ పనికిమాలిందని వీరంగం వేస్తున్నారు. ఆ కమిషన్‌కు విచారణ అర్హతే లేదు పొమ్మన్నారు. జూన్ 15న విచారణకు రావాలని ఆదేశిస్తే జులై 30 వరకు సమయం అడిగారు. కానీ కమిషన్ అందుకు ఒప్పుకోకుండా చెప్పిన తేదీకి వచ్చి తీరాల్సిందే అని వెల్లడించింది. సరిగ్గా ఆ గడువు పూర్తి కాగానే కమిషన్‌పై ఘాటు విమర్శలు చేస్తూ.. 12 పేజీల లేఖ రాశారు. నరసింహారెడ్డి తీరును తప్పుబట్టారు. ఏం చేసుకుంటావో చేసుకో అన్నట్లుగానే ఆ లేఖ రాశారు. తాను విచారణకు హాజరయ్యేది లేదని తేల్చిపారేశారు. అసలు నరసింహారెడ్డికి విచారణార్హతే లేదని చెప్పిన తరువాత ఇంకెందుకు హాజరవుతారు? కరెంటు కొనుగోళ్ల విషయంలో, భద్రాద్రి విద్యుత్ కేంద్రం నిర్మాణం విషయంలో తాను చేసిందంతా కరక్టేనని చెప్పారు. కరెంటు బాధల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన తనను మెచ్చుకోవాల్సిందిపోయి విచారణ చేయడమేమిటని ఎదురుదాడి చేశారు. నిజానికి కేసీఆర్ లేఖలో రాసిన విషయాలనే కమిషన్ ఎదుట చెప్పొచ్చు. తన వాదన వినిపించవచ్చు. కమిషన్ ను కన్విన్స్ చేయొచ్చు. కానీ విచారణ కమిషన్ తనను విచారణకు రమ్మని పిలవడాన్ని కేసీఆర్ అవమానంగా భావించారు.



చావు నోట్లో తలపెట్టి తెలంగాణా తెచ్చినోడిని ఇంతగా అవమానిస్తారా ? అని కుతకుత ఉడికిపోయారు. ఇది రాజకీయ కక్షగా ఆయన భావించారు. జస్టిస్ నరసింహారెడ్డి ముందుగానే ఒక అభిప్రాయానికి వచ్చారు కాబట్టి ఏం చెప్పినా ఆయన వినరని కేసీఆర్ ఫిక్స్ అయిపోయారు. చట్టబద్ధంగా ఏర్పాటైన విచారణ కమిషన్ ముందు హాజరు కాకపోవడం నేరమవుతుందనే విషయం కేసీఆర్‌కు తెలియదా ? తెలియకుండా ఉండదు. తన లీగల్ టీమ్‌తో మాట్లాడే ఉంటారు. మరి వాళ్ళేం సలహా ఇచ్చారో. కేసీఆర్ రాసిన లేఖపై జస్టిస్ నరసింహారెడ్డి పాజిటివ్ గానే స్పందించారు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలు చెప్పుకునే హక్కు ఉందన్నారు. ఆయన లేఖలో పేర్కొన్న అంశాలపై కూలంకషంగా పరిశీలిస్తామని, నిపుణులతో, బీహెచ్ఈఎల్ ఇంజినీర్లతో చర్చిస్తామని చెప్పారు. ఆ తరువాత ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కమిషన్ అందరితో చర్చించాక కేసీఆర్ లేఖలోని అంశాలపై ఏం తేలుస్తుందో చూడాలి. కేసీఆర్ కాళేశ్వరం విచారణను కూడా ఎదుర్కోవాల్సి ఉంది.

ఆ ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వామ్యం ఉన్న ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలు అన్నీ కేసీఆర్ చెప్పినట్లే చేశామని అంటున్నారు. తాము చెప్పింది ఆయన వినలేదని చెబుతున్నారు. దీనిపై విచారిస్తున్న జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ కేసీఆర్‌ను పిలిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవేళ కేసీఆర్ రాకపోతే ఎలా రప్పించాలో తనకు తెలుసని చెప్పారు. దీనిపై సమన్లు వస్తే కేసీఆర్ ఎలా స్పందిస్తారో. మరి నరసింహా రెడ్డి కమిషన్ కేసీఆర్‌ను విచారణకు రప్పించగలదా?



- మేడేపల్లి నాగేందర్
సీనియర్ జర్నలిస్ట్
99851 19146

# "పరమ పవిత్రమైనది నిర్జల ఏకాదశి"



తిథులు అన్నింటిలోకి ఏకాదశి చాలా పవిత్రమైనది. ఇది ఉపవాసాలకు ఉద్దిష్టమైన దినం. ఏకాదశి 15 రోజులకు ఒకసారి వస్తుంది. పక్షానికి ఒకటి, మాసానికి రెండు చొప్పున సంవత్సరానికి ఇరవై నాలుగు, అధిక మాసం వచ్చే సంవత్సరంలో ఇరవై ఆరు ఏకాదశులు వస్తాయి. వస్తాయి ఇవన్నీ ప్రత్యక్ష పర్వాలుగా ఆచరించ బడతాయి "పద్మ పురాణం ఉత్తర ఖండం"లో ఏకాదశి వ్రత మహత్యం వివరించబడింది. ఏకాదశి సకలోపద్రవ నాశకమైనది. దీనితో సమానమైన వ్రతం లేదు. ఏకాదశ ఇంద్రియాలచే, చేసిన పాపాలన్నీ ఏకాదశి ఉపవాసంతో నశిస్తాయి. సకల వర్ణాల వారికి, ఆశ్రమ వాసులకు, స్త్రీలకు, ఏకాదశి వ్రతం చేయదగినది. దశమితో కూడిన ఏకాదశిని వర్జించి, పరిశుద్ధమైన ఏకాదశి యందు ఉపవాసం చేయాలి. దశమి నాడు ఏకభుక్తం చేసి ఆ రాత్రి కటిక నేలపై పరుండి, మరునాడు ఏకాదశినాడు, ఉసిరిక నూరి శరీరానికి పూసుకుని స్నానమాచరించి, ఉపవాసం ఉండి, పురాణ పఠనా తత్పరులై, పగలు నిద్రింపక, రాత్రి వరకు కటిక నేలపై విశ్రమించి ద్వాదశినాడు పూజ పారణ భోజనం చేయాలి. ఏకాదశి అన్నింటిలోనూ కఠినతరమైనది "నిర్జల ఏకాదశి". జేష్ఠ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు "గంగోత్సవాల"ను నిర్వహించడం ఆచారం. జేష్ట మాసం లో ఎండలు మెండుగా ఉంటాయి. భూమిలో నీటి మట్టం చాలావరకు అడుగుకు పోతుంది. అట్టి గడ్డు వేసవిలో, ఏకాదశి ఈనాడు, పచ్చి మంచి నీళ్ళు అయినా పుచ్చుకోకుండా, ఉపవాస దీక్ష ఆచరించడం సనాతన సాంప్రదాయ ఆచారం. అందుకే దీనికి "నిర్జలైకాదశి" అని పేరు వచ్చింది. నిర్జలైకాదశి "భీముని" వలన ఏర్పడినట్లు పురాణగాథ ఉంది భీముడు తిండిపోతు. ఒక పూట కూడా తిండి లేకుండా అస్సలు ఉండలేదు. అందుచేత దశమి నాడు ఏకభుక్తం చేసి, ఏకాదశి నాడు ఒక పూట అయినా భోజనం లేకుండా, ఉపవాసం ఉండే ప్రసక్తే ఆయనకు రాదు. పాండవులు అంతా ఏకాదశి వ్రతాచరణ చేస్తుండగా, భీముడు ఆచరించ లేక పోయేవాడు. అయితే భీముడు వేదవ్యాస మహర్షిని సంప్రదించగా, "జేష్ట మాసం లో సూర్యుడు వృషభ రాశి నుండి మిధున రాశి లో ప్రవేశిస్తాడు, కనుక అప్పుడు "నీవు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నాడు నీళ్లు కానీ ముట్టకుండా, అన్నం తినకుండా ఉండాలి, అలా చేస్తే, ఏడాదిలో ఇరవై నాలుగు ఏకాదశి వ్రతాలు చేసిన ఫలితం నీకు సమ కూర గలదు" అని వ్యాసుడు వివరించగా భీముడు ఆచరించడం జరిగింది. తద్వారా భీముడు ఏడాది ఏకాదశి వ్రత ఫలం పొందినట్లు చెప్పబడింది. అందుకే దీనిని "భీంసేని ఏకాదశి" అని కూడా అంటారు. "స్మృతి కౌస్తుభం", "చతుర్వర్గ చింతామణి" గ్రంథాలలో నిర్జలైకాదశి గురించి విపులీకరించబడింది. నిర్జల ఏకాదశి నాడు విష్ణు పూజ చేయడం పరిపాటి. విష్ణు ప్రతిమకు, సాలగ్రామకు పంచామృత అభిషేకం, జలాభిషేకం, పుష్ప, ఫల, హారతి సమర్పణ, వస్త్రాలు, ధాన్యాలు, గొడుగులు, విసనకర్రలు, ఉదకుంభాలు, వస్త్రాలు, బంగారం, గోవు,మంచం దానం చేయడం, రాత్రి జాగరణ, విధాయక కృత్యాలు. బ్రాహ్మీ ముహూర్తంలో "విష్ణు సహస్రనామాల" తో ప్రారంభించి, "ఓం నమో భగవతే వాసుదేవాయ" మహా మంత్ర జపం చేస్తూ ఉండాలి. రామాయణ సంబంధ అరణ్య కాండ పఠించాలి. తల్లిదండ్రుల, గురువుల ఆశీస్సులు పొంది, ఆధ్యాత్మిక పుస్తక దానం చేయడం పుణ్యప్రదం. మానవులతో పాటు, జంతువులకు పక్షులకు ఆహారం, శీతల పానీయాలు ఇవ్వాలి. నిర్జల ఏకాదశి వ్రతాచరణ ద్వారా మోక్ష ప్రాప్తియే కాకుండా, ఆచరించినవారికి "యమపురి" ఉండదని, మరణానంతరం నేరుగా వైకుంఠ లోక ప్రాప్తి లభించ గలదని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.

-రామ కిష్టయ్య సంగనభట్ల
9440595494

# రైల్వేను మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం

● ప్రచారం తప్ప రైల్వేల అభివృద్ధికి చేసిందేమీ లేదు : బెంగాల్ సీఎం మమతా బెనర్జీ



**పశ్చిమ బెంగాల్:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీ ప్రభుత్వ నియంత్రణ లోని రైల్వే మంత్రిత్వ శాఖ ప్రయాణికుల సౌక ర్యాలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు చేశారు. మోడీ ప్రభుత్వం ఎన్నికలను మాత్రమే పట్టించుకుంటున్నదని ఆమె విమర్శించారు. సోమవారం బెంగాల్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదం నేపథ్యంలో మమతా బెనర్జీ ప్రధాని మోడీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తాను రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో రెండు, మూడు రైలు ప్రమాదాలు చూశాక అటువంటి రైళ్ల ప్రమాదాలను నివారించేందుకు డివైజ్‌ను రూపొందించి, అందుబాటులోకి తీసుకొచ్చాం. ఆ తర్వాత రైళ్ల ప్రమాదాలు ఆగిపోయాయని మమతా తెలిపారు. కానీ, ఇప్పుడు రైల్వే శాఖ లో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని పరిస్థి తి నెలకొంది. రైల్వే శాఖ సమస్యలతో నిండిపో యిందని ఆమె విచారం వ్యక్తం చేశారు. రైల్వే ను ప్రధాని మోడీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. 'రైల్వే అధికారులు, రైల్వే ఇంజనీర్లు, రైల్వే టెక్నికల్ సిబ్బంది, కార్మికులు ఇలా ఎవరినీ పట్టించుకోవడంలేదు. వారంతా ఇ బ్బందులు పడుతున్నారు. వారి పాత పెన్షన్‌ను రద్దు చేశారు. ఈ విషయంలో తాను పూర్తిగా రైల్వే ఉద్యోగులు, అధికారులకు మద్దతిస్తున్నా ను. కానీ మోడీ ప్రభుత్వం వారిని పట్టించుకో కుండా ఎన్నికల్లో ఎలా అవకతవకలకు పాల్ప డాలి, రిగ్గింగ్ ఎలా చేయాలనే దానిపై పనిచే స్తున్నారని విమర్శించారు. తన హయాంలో రైల్వేల అభివృద్ధిని అవసరమైనన్ని నిధులు సమకూర్చాను. ఇప్పుడు మోడీ సర్కార్ రైల్వే బడ్జెట్‌ను తొలగించి, వాటికి సరైన నిధులు కేటాయించకుండా వదిలేశారు. వందే భారత్ రైళ్ల గురించి ప్రచారం తప్ప రైల్వేల అభివృద్ధికి మోడీ ప్రభుత్వం ఏమీ చేయలేదని మమతా బెనర్జీ ఆరోపించారు.

# జనసేనకు మరో కీలక పదవి!

● డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వనున్నట్లు టాక్ ● ఎవరికి దక్కుతుందోనని సర్వత్రా ఆసక్తి



**విశ్వంభర, అమరావతి:** ఏపీ ప్రభుత్వంలో ఇప్పుడు జనసేనకు మరింత కీలక భాగస్వామ్యం ఇవ్వా లని చంద్రబాబు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే మొన్నటి ఎన్నికల్లో అసలు టీడీపీకి అన్ని సీట్లు రావడానికి కూడా జనసేనతో పొత్తులే కారణం అని అంటున్నారు. అందుకే చంద్రబాబు నాయుడు కూడా వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబోతున్నారంట. ఇప్పటికే పవన్ కల్యాణ్ కు డిప్యూటీ సీఎం పదవితో పాటు కీలక శాఖలను అప్పగించారు. దాంతో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కు కీలక శాఖలే ఇచ్చారు. ఇక ఇప్పుడు జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని చూస్తున్నా రంట. అది కూడా బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారికే ఇవ్వాలని చూస్తున్నా రు. అలా అయితే జనసేనాని నిర్ణయిస్తే నెల్లిమ ర్ల ఎమ్మెల్యే లోకం మాధవికి అవకాశం దక్క నుంది. జనసేన నుంచి గెలిచిన ఏకైక మహిళా ఎమ్మెల్యే ఆమెనే. కాబట్టి ఇప్పుడు ఆమెకు అవకాశం దక్కుతుందని అనుకుంటున్నారు. వైసీపీ హయాంలో కూడా బ్రాహ్మణులకే డిప్యూ టీ స్పీకర్ పదవి దక్కింది కాబట్టి.. ఇప్పుడు కూడా ఆ సామాజిక వర్గానికే ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.



## రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో

# పరుగులు పెట్టిస్తాం

- రాష్ట్రానికి మంత్రి అయినా జిల్లాకు కూలీగా పని చేస్తా
- నమ్మకంతో బాబు ఆర్థిక శాఖ అప్పగించారు
- ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ లెక్కలు చూడాలి
- మంత్రి పయ్యావుల కేశవ్

**విశ్వంభర, అనంతరపురం:** రాష్ట్రానికి మంత్రిగా బాధ్యతలు చేపట్టినా తమ జిల్లాకు మాత్రం తాను కూలీగా పని చేస్తానని ఆర్థిక శాఖ, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా జిల్లాకు వస్తున్న పయ్యావుల కేశవ్‌కు సోమవారం మండలంలో ని బాట సుంకులమ్మ ఆలయ సమీపంలో ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణిశ్రీ, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుబాటి వెంకట ప్రసాద్, ఎమ్మెస్ రాజు, జేసీ.అస్మిత్ రెడ్డి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే జేసీ.ప్రభాకర్ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు జి.వెంకట శివుడు యాదవ్ లు ఘన స్వాగతం పలికారు. మంత్రి బాటసుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న ఎన్టీఆర్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై మంత్రి రోడ్ షో నిర్వహించారు. మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుత్తికి వచ్చిన మంత్రికి టీడీపీ శ్రేణులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కేశవ్ మాట్లాడారు. సీఎం నారా చంద్ర బాబు నాయుడు తనపై నమ్మకంతో ఆర్థిక శాఖను అప్పగించారని అన్నారు. ఇంకా ఆర్థిక శాఖకు సంబంధించి ఖజానా పుస్తకాలు తెరవ లేదని గత ఐదేళ్లలో ఏమి జరిగిందో తెలుసుకో వాలని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తా మన్నారు. తాను ఆరాటాలు, పోరాటాల మధ్య పెరిగానని అన్నారు. రైతులు పడ్డ కష్టాలు తనకు తెలుసునన్నారు. తన 30 ఏళ్ల రాజకీ య జీవితంలో సాగునీరు, తాగునీటి కోసం అనేక పోరాటాలు చేశానని అన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు.

## రేషన్ కార్డుదారులకు

# ఏపీ సర్కార్ గుడ్ న్యూస్


- కందిపప్పు, పంచదార పంపిణీకి నిర్ణయం
- వచ్చే నెల నుంచి మొదలు



**విశ్వంభర, విజయవాడ:** తెల్ల రేషన్‌కార్డు దారులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జులై నెల నుంచి రేషన్‌కా ర్డు దారులకు బియ్యంతో పాటుగా పంచదార, కందిప ప్పును కూడా అందించనున్నారు. గత కొన్నిరోజులుగా ఏపీలో రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు పంపిణీ నిలిచి పోయింది. ఈ నేపథ్యంలో రేషన్ కార్డుదారులు ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. అయితే కొత్తగా వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై దృష్టి సారించింది. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ జరగడం లేదనే వార్త ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి రాగా.. ఆయన వెంటనే స్పందించారు. కందిపప్పు పంపిణీ వచ్చే నెల నుంచి ప్రారంభించాలని ఆదేశించిన ట్లు సమాచారం. ఇక ముఖ్యమంత్రి ఆదేశాలతో ఏపీ పౌరసరఫరాలశాఖ అధికారులు కూడా చర్యలు చేపట్టారు. పంపిణీ కోసం కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించారు. సాధారణంగా జూన్ 20 వ తేదీ వరకూ రేషన్ షాపులకు సరుకులు చేరుకుంటాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో కందిపప్పు, చక్కెర కూడా మిగతా సరుకులతో పాటుగా రేషన్ దుకాణాలకు చేరనుంది. రేషన్ షాపుల్లో కందిపప్పు దొరకకపోవటంతో ఇన్నిరోజులు మధ్యతరగతి జీవులు ఇబ్బందులు పడ్డారు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు రేటు రోజురోజుకూ పెరిగిపోతున్న క్రమంలో.. సగటు జీవికి తాజా నిర్ణయం ఊరట కలిగించనుంది. మరోవైపు నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన దగ్గర నుంచి ప్రజలకు అనుకూలంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబు నాయుడు.. రేషన్ సరుకుల విషయంలోనూ ఊరట నిచ్చే నిర్ణయం తీసుకున్నారని తెల్లరేషన్ కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జులై ఒకటి నుంచి పెరిగిన పింఛన్లు అమల్లోకి రానుండగా.. వాటికి జతగా తెల్లరేషన్ కార్డుదా రులకు ఈ ఊరట కూడా దక్కనుంది.

# జైలులో మహిళా ఖైదీ హైడ్రామా..



**విశ్వంభర, ఆదిలాబాద్ :** భర్త దారుణ హత్య కేసులో ఏ 1 నిందితురాలుగా జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఓ నిందుతురాలు జైలు నుండి బయటపడేందుకు సూపర్ క్వీన్ యాక్టింగ్ ప్రదర్శించింది. ఆత్మహత్య చేసుకున్నాని.. ప్రాణాలు పోతున్నాయంటూ గొంతు పట్టుకుని కేకలు వేసింది. నిజమేనని నమ్మిన జిల్లా జైలు సిబ్బంది నిందితు రాలి ప్రాణాలు కాపాడేందుకు హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నిందితురాలు ఆరోగ్యంగానే ఉందని ఎలాంటి ప్రమాదం లేదని తేల్చడం తో ఊపిరి పీల్చుకున్నారు. ఆత్మహత్య యత్నం అంతా ఉ త్తిదే అని గుర్తించిన జైలు సిబ్బంది నిందితురాలిని తిరిగి జైలుకు తరలించారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా జైల్‌లో చోటు చేసుకుంది.

### భర్తను చంపిన కేసులో రిమాండ్

జూన్ 12న ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం అర్జు ని, లోకారి శివారు అటవీ ప్రాంతంలో ప్రభుత్వ ఉపాధ్యా యుడు గజేందర్ దారుణ హత్యకు గురయ్యాడు. 24 గంటల్లోనే కేసును చేదించిన పోలీసులు.. గజేందర్ హత్యకు కర్త, కర్మ, క్రియ భార్య విజయలక్ష్మి అని తేల్చారు. ప్రియుడి మాయలో పడి.. ఆరు లక్షల సుపారీ ఇచ్చి మరి భర్తను దారుణంగా హత్య చేయించిందని గుర్తించి అరెస్ట్ చేశారు పోలీసులు. ఈనెల 15న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిలాబాద్ జిల్లా జైలులో రెండు రోజులు రిమాండ్ ఖైదీగా గడిపిన విజయలక్ష్మి సూపర్ యాక్టింగ్‌తో జిల్లా జైలు సిబ్బందిని బోల్తా కొట్టించే ప్రయత్నం చేసింది. జైలులో హైడ్రామా క్రియేట్ చేసి కడుపులో విఫరీతమైన నొప్పి ఉందని.. అరెస్ట్ సమయంలో ఉట్నూర్ డీఎస్పీ కార్యాలయంలో బ్లేడ్ ముక్కలు మింగానని ఆదిలాబాద్ జిల్లా సూపరింటెండెంట్‌కు గోడు వెళ్లబోసుకుంది. రిమాం డ్ ఖైదీ కావడం అందులోను మహిళ కావడంతో నిజమే అని నమ్మిన జైలు సిబ్బంది.. తనను కాపాడేందుకు హు టాహుటిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలిం చారు. పరీక్షించిన వైద్యులు ఎండోస్కోపీ నిర్వహించి ఎలాంటి ప్రమాదకర పదార్థం మింగలేదని.. బ్లేడ్ ముక్కలు లాంటివి ఏం లేవని తేల్చారు. రెండు గంటలు అబ్జర్వేష న్‌లో పెట్టిన వైద్యులు నిందితురాలి ఆరోగ్యం బాగానే ఉ ందని తేల్చారు. దీంతో ఊపిరి పీల్చుకున్న జిల్లా జైలు సిబ్బంది తిరిగి భద్రత నడుమ నిందితురాలు విజయలక్ష్మిని జిల్లా జైలుకు తరలించారు. విజయలక్ష్మి సూపర్ క్వీన్ యాక్టింగ్ ను చూసిన జిల్లా జైలు సిబ్బంది ముక్కు మీద వేలాసుకున్నారు. భర్తను అత్యంత కిరాతకంగా హత్య చేయించిన నిందితురాలిని కూడా నమ్మాల్సిన పరిస్థితి ఏర్పాడిందంటూ వాపోయారు.

## ఏపీ పోలీసుల్లో

# వైసీపీ రక్తం ప్రవహిస్తుంది

అంతా ప్రేమ ఉంటే రాజీనామా చేయండి హెూం : మంత్రి వంగలపూడి అనిత



**విశ్వంభర, సింహాచలం:** రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి జరగాలని సింహాద్రి అప్పన్న స్వామిని కోరుకున్నానని ఏపీ హెూంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సింహాచలం లో స్వామి వారిని ఆమె దర్శించుకున్నారు. తొలుత ఆల య అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అనిత మీడియాతో మాట్లా డారు. మంత్రి పదవి వచ్చిన తర్వాత అప్పన్న స్వామిని దర్శించుకోవాలని ఇక్కడికి వచ్చానని తెలిపారు. సింహాచలం దేవస్థానం భూములు ఒక్క గజం కూడా అన్యాక్రాంతం కాకుండా చూస్తానన్నారు. పంచగ్రా మాల భూ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది పోలీసు అధికారులు ఆ పార్టీ నేతలకు తొత్తులుగా పనిచేశారని అనిత విమర్శిం చారు. ఇప్పటికీ వారిలో వైసీపీ రక్తం ప్రవహిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. జగన్‌పై ఇంకా ప్రేమ ఉంటే ఉ ద్యోగానికి రాజీనామా చేసి ఆ పార్టీ కోసం పనిచేసుకోవా లని హితవు పలికారు. శాంతిభద్రతల విషయంలో ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నా రు. ముఖ్యంగా మహిళలకు అన్యాయం జరగకుండా చూస్తానని తెలిపారు. లా అండ్ ఆర్డర్ విషయంలో ఎవరు తప్పుచేసిన వొదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మహిళలకు అన్యాయం జరగకుండా చూస్తానని, అవసరం మేరకు న్యాయ పోరాటం చేస్తామని హెూంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.



# ఈరోజు బ్లాక్ డే..

## రాజాసింగ్ సంచలన ట్వీట్..!

**విశ్వంభర, గోషామహల్ :** బక్రీద్ పండగ వేళ బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ట్వీట్ చేశారు 'ఆవుకు రొట్టెలు తినిపించే వారు.. మరియు రొట్టెతో ఆవును తినే వారు ఎప్పటికి సోదరులు కాలేరన్నారు. ఆవును తల్లిగా భావించే హిందూవులం దరికీ ఈ రోజు 'బ్లాక్ డే' అని రాజాసింగ్ ట్వీట్ చేశారు. అయితే బక్రీద్ పండుగ సందర్భంగా రాజా సింగ్ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అంతకుముందు అసదుద్దీన్ ఓవైసీ ట్విట్ట ర్ వేదికగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఫ్రిడ్జ్ లో బీఫ్ ఉ ందనే కారణంతో 11 ఇళ్లను బుల్డోజ్ చేసిందని ఫైర్ అయ్యారు. ఎన్నికల ముందు తర్వాత అన్యాయమనే చక్రం ఆగడం లేదన్నారు.



## ఎలా హ్యాక్ చేస్తారో

# చూపించు మరి!

## ఎలాన్ మస్క్‌కు పురందేశ్వరి కౌంటర్

**విశ్వంభర, అమరావతి:** ఈవీఎంల వాడకాన్ని ప్రపంచ దేశాలు బహిష్కరించాలని, కొంత మేర ఈవీఎంలను హ్యాకింగ్ చేసే అవకాశం ఉందని, మనుషులు కానీ, ఏఐ టూల్స్‌తో కానీ ఈవీఎంల హ్యాకింగ్ అసాధ్యమే మీ కాదని ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు భారత్‌లో దుమారం రేపుతున్నాయి. మస్క్ వ్యాఖ్యలను విపక్షాలు ఓ ఆయుధంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. భారత్‌లో ఈవీఎంలు బ్లాక్‌బాక్స్‌ల వంటివని, వాటిని కనీసం పరిశీలించేందుకు కూడా ఎవరినీ అనుమతిం చరని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యం లో ఏపీ బీజేపీ చీఫ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పందించారు. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చంటున్న ఎలాన్ మస్క్‌ను భారత ఎన్నికల సంఘం ఆహ్వానించాలని, ఈవీఎంలను ఎలా హ్యాక్ చేయవచ్చో నిరూపించేందుకు అతడికి ఓ అవకాశం ఇవ్వాలని వ్యంగ్యం ప్రదర్శించారు. ఈవీఎంలపై పరిశోధనలకు ఎన్నికల సంఘం చాలామందికి అవకాశం ఇచ్చిందని, కానీ ఎవరూ హ్యాక్ చేయలేక పోయారని పురందేశ్వరి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు.

# దాన గుణం నేర్పే 'బక్రీద్'



**విశ్వంభర, ఆమనగల్లు / ఆత్మకూరు(ఎం) / భూపాలపల్లి/చింతపల్లి:** ధాన ధర్మాలకు ప్రతీక బక్రీద్ అని కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బక్రీద్ వేడుకల్లో భాగంగా కసిరెడ్డి గారు సోమవారం అమనగల్లు పట్టణంలోని ఈద్గా వద్ద అందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని గుణాల్లోనూ దానగుణం గొప్పదని అటువంటి గుణాన్ని ప్రజలకు నేర్పే పండుగ బక్రీద్ అని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కులమత బేధాలు లేకుండా శాంతియుతంగా కలిసిమెలసి జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అమనగల్లు ఎంపీపీ అనిత విజయ్, పార్టీ అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, అమనగల్లు మాజీ మండల అధ్యక్షుడు మండ్లి రాములు, శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ నాయకులు బాబా, జహంగీర్, అలీం, ఫరీద్, పార్టీ నేతలు విజయ్ రాథోడ్, కృష్ణ, శ్రీశైలం, శ్రీను, సురేశ్, రాఘవేందర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు(ఎం)లో...**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త త్యాగాన్ని స్మరించుకుంటూ త్యాగం, కరుణ మరియు ఐక్యత అలవర్చుకోవటమే బక్రీద్ పర్వదినమని అన్నారు.

**త్యాగానికి ప్రతీక బక్రీద్ :మంత్రి శ్రీధర్ బాబు**

బక్రీద్ పండుగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముస్లింలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, త్యాగం, సహనం, దాతృత్వం అనే సుగుణాలకు బక్రీద్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. అల్లా దయ మంథని నియోజకవర్గంతో పాటు ఈ రాష్ట్ర ప్రజలపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

**చింతపల్లిలో...**

మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులు ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్యాగగుణాన్ని ప్రబోధించే బక్రీద్ పండుగ స్ఫూర్తిగా సమైక్యతను, సమానత్వాన్ని పంచాలని ఎమ్మెల్యే పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భవాని పవన్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ రెడ్డి, చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల గిరి,యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలి

### టీజేయూ జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబా

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని స్థానిక ఎస్వీ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ మాట్లాడుతూ.. ఈ నెల 20న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ముఖ్య అతిథిగా తెలంగాణ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కప్పర ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, ఐ ఎఫ్ డబ్ల్యూజే జాతీయ ఉపాధ్యక్షులు పెద్దపురం నరసింహ హాజరు అవుతారని తెలిపారు. వివిధ మండలాల, జిల్లాలో ఉన్న జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నబత్తిని మత్యాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపరాజు వెంకన్న, జర్నలిస్టులు గడ్డం సత్యనారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా బాల్ద వెంకటేష్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో ఇటీవల నిరుపేద కుటుంబానికి చెందిన దేవరకొండ రమేశ్ చారి మరణించాడు. విషయం తెలుసుకున్న బీర్ల యోజన సంఘం అధ్యక్షుడు బాల్ద వెంకటేష్ బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించి వారి కుటుంబానికి సహాయంతోపాటు భరోసాని కల్పించారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంతుల నవీన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, మాజీ మండల అధ్యక్షుడు సిరబోయిన మల్లేష్ యాదవ్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు రేగుశేఖర్, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్, బోనగిరి ఎల్లయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు భూమండ్ల బంగారి, మంజూరు ఖాన్, బుగ్గ సిద్ధులు, భూమండ్ల మహేష్, కొండ మహేష్, విశ్వకర్మ నాయకులు దేవరకొండ కుమారస్వామి, దేవరకొండ శంకరాచారి, దేవరకొండ జగన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డికి మంత్రి పదవి రావాలి

### ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి



**విశ్వంభర, నారాయణపూర్ :** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రావాలని సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ ప్రాంతంలో శ్రీ స్వయంభు లింగేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు చేసిన నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి, అనంతరం ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్ చందర్ రెడ్డిని ఆలయ పూజారి, కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుత్తా ప్రతీక్ రెడ్డి, విజయలక్ష్మి, ఉప్పల వెంకటేష్, నాగరాజు, కుకుట్లపల్లి కవిత, అంబికా, సుమలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మిరియాల శీనుకు ఆర్ధిక సహాయం



**విశ్వంభర ఆమనగల్లు :** తలకొండపల్లి గ్రామానికి చెందిన మిర్యాల శీను రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. శీను హైదరాబాదులో ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బీఆర్ఎస్ నాయకులు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అతనిని పరామర్శించి చెరోక రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అనిల్, డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, అసెంబ్లీ సోషల్ మీడియా ఇన్చార్జ్ అజీం, నాయకులు బోల్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కేర్ గ్యారేజీని ప్రారంభించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా లోని మోరంచపల్లి గ్రామంలో ఎస్ఎం కొత్తపల్లి రోడ్డులో సంపెల్లి సదయ్యకి చెందిన మహవీర్ ఆటో కేర్ గ్యారేజిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్యారేజీ నిర్వాహకులు, కాంగ్రెస్ నేతలు శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని, ఆర్థికంగా బలపడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.





## గోదావరిలో మునిగి యువకుడి మృతి

### తల్లడిల్లిన తల్లిదండ్రులు

**విశ్వంభర. భూపాలపల్లి:** కళ్ళముందే కొడుకు గోదావరిలో గల్లంతై ప్రాణాలు కోల్పోగా కన్నవారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వర త్రివేణి సంగమం గోదావరి నదిలో జరిగింది. వరంగల్ లోని లేబర్ కాలనీకి చెందిన గరికపాటి ప్రవీణ్, రజిని దంపతుల కుమారుడు అఖిల్ కుటుంబసభ్యులతో కలిసి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనానికి వచ్చారు. ఈ క్రమంలోనే గోదావరిలో పుణ్య స్నానాలు చేస్తుండగా అఖిల్ గల్లంతయ్యాడు. తన కొడుకు గోదావరిలో మునిగిపోతుండగా చూసి తల్లడిల్లిన తల్లిదండ్రులు స్థానికులకు సమాచారం అందించారు. అక్కడ ఉన్న జాలర్లు వెంటనే రంగంలోకి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు జాలర్లు, గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కానీ అఖిల్‌ను ప్రాణాలతో కాపాడలేక పోయారు. అయితే ఆదివారం జరిగిన ఘటనలో సోమవారం రోజు ఉదయం అఖిల్ మృతదేహం లభ్యమైంది. పుణ్య స్నానానికి వచ్చి విగత జీవిగా మారిన కన్న బిడ్డను చూసి ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. చేతికందిన కొడుకు ఆ కుటుంబసభ్యుల్లో తీరని శోకాన్ని మిగిల్చి వెళ్లిపోయాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసారు.

## విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో దుద్దిళ్ల నిశాంత్ (24) అనే వివాహితుడు మృతి చెందిన సంఘటన మల్హార్ మండలంలోని రుద్రారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల, గ్రామస్తుల కథనం ప్రకారం.. నిశాంత్ ఇంటివద్ద బోర్ మోటార్ వైర్ లూజు ఉందని పైకి కడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడికి 6 నెలల క్రితమే వివాహం జరిగింది. నిశాంత్ అకాల మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మెదక్‌లో గంటల వ్యవధిలోనే అత్తా, అల్లుడు మృతి

**విశ్వంభర, చేగుంట :** బక్రీద్ పండుగపూట మెదక్ జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. గుండెపోటుతో గంటల వ్యవధిలోనే అత్తా, అల్లుడు మృతి చెందారు. ఈ ఘటన చేగుంట మండలం మక్కరాజుపేటలో సోమవారం ఉదయం జరిగింది. ఆదివారం రాత్రి గుండెపోటుతో అల్లుడు నరసింహులు (58) మృతిచెందగా.. అల్లుడి మరణవార్త విని తట్టుకోలేక గుండెపోటుతో అత్త నర్సవ్వ సోమవారం ఉదయం కన్నుమూశారు. గంటల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులంతా కన్నీరుమున్నీరుగా కుటుంబంలో విలపిస్తున్నారు.



తెలంగాణ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ, బయోడీజిల్ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు మల్కేడి బన్సీలాల్ ఆదివారం కేంద్రం మంత్రి వీరంద్ర కుమార్‌ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలశాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు.

- విశ్వంభర, ఆమనగల్లు

## ప్రజల సమస్యలపై అక్షరాయుధాలు సంధించిన కవి రావికంటి రామయ్య గుప్తా

○ మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి

**విశ్వంభర, మంథని:** ప్రజా కవి, మంత్రకూట వేమన రావికంటి రామయ్య గుప్తా ఉపాధ్యాయుడుగా, కవిగా ఎనలేని సేవలందించారని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమాదేవి కొనియాడారు. ఆయన ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ కవితలు అల్లే వారని గుర్తు చేశారు. ఆయన మంథని ప్రాంతం గర్వించదగ్గ ముద్దుబిడ్డ అన్నారు. రామయ్య గుప్తా 88వ జయంతి సందర్భంగా సోమవారం మంథనిలోని వారి కాంస్యవిగ్రహానికి ఆమె పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. గతంలో మంథని ప్రాంతాన్ని వరదలు ముంచెత్తినప్పుడు వరద గోదావరి పేరిట బతుకమ్మ పాటలు రాశారని, ప్రజా సమస్యలపై అనునిత్యం అక్షర పోరాటం చేశారని అన్నారు. వారి సేవలను నిరంతరం గుర్తు చేసుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వారి కీర్తి ప్రతిష్టలను దశ దిశలా వ్యాప్తి చేయడానికి తమ వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాచె శశి భూషణ్, భారాస నేత బత్తుల సత్యనారాయణ, భాజపా నేత, రాష్ట్ర సెన్సార్ బోర్డు సభ్యుడు బోగోజు శ్రీనివాస్, వైశ్య సంఘం నేతలు కొమురవెల్లి శ్రీనివాస్, కిశోర్, కొంతం వివేక్, రేపాల రమేశ్, ఉపాధ్యాయుడు బిరుదు మధు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంథని విద్యార్థి యువత కార్యాలయం కొండేల మారుతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యెలిశెట్టి రాధాకృష్ణయ్య, రేపాల సత్యనారాయణ, మేడగోని రాజమౌళి గౌడ్, రామడుగు మారుతి, కొమురవెల్లి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. రావికంటి రామయ్య గుప్తా వ్యక్తిత్వం, కవిత్వాల ప్రత్యేకతలను వివరించారు. వారితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రావికంటి రామయ్య తనయుడు, సీనియర్ జర్నలిస్ట్ రావికంటి శ్రీనివాస్ వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

**పాలకొల్లులో..**

సామాజిక రుగ్మతలపై అక్షర ఖడ్గం దూసిన ప్రజాకవి రావికంటి రామయ్య గుప్త జయంతిని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో విశ్వమానవవేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వమానవవేదిక అధ్యక్షుడు మాట్లాడుతూ.. అభ్యుదయం, సాంఘిక సంస్కరణ, మద్యపానం, నిరక్షరాస్యత.. ఒక్కటేమేటి సమాజాన్ని పట్టి పీడించే ప్రతీ సామాజిక రుగ్మతని ప్రశ్నించడంలో వేమన, కందుకూరి, గురజాడల పోరాట వారసత్వాన్ని రావికంటి రామయ్య గుప్త కొనసాగించారని తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని రావికంటి రామయ్య గుప్త గారి సాహిత్యాన్ని పుస్తకాలు ప్రచురించి గౌరవించడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వమానవవేదిక సభ్యులు గుంపుల రవి, డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరి, నిల్లా శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రావికంటి రామయ్య గుప్తా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి, సీనియర్ జర్నలిస్ట్ రావికంటి శ్రీనివాస్




మంథని విద్యార్థి యువత కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపకుడు కొండేల మారుతి

## బొడ్రాయి పండుగలో పాల్గొన్న మాజీ మంత్రులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండల కేంద్రంలో జరిగిన బొడ్రాయి పండుగ కార్యక్రమంలో మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, గుంటకండ్ల జగదీష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రులతోపాటు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, పైళ్ల శేఖర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ , టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సూదగానీ హరికృష్ణ గౌడ్, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# రాష్ట్రంలో గంజా, మత్తు మాఫియాలను ఉక్కు పాదంతో అణిచివేస్తాం

- బాలిక కుటుంబానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుంది
- బాలిక మృతికి కారకులను కఠినంగా శిక్షిస్తాం
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క




**విశ్వంభర, మహబూబాబాద్ :** హైదరాబాద్ నగరం నడిబొడ్డున బాలికను దారుణంగా హత్య చేశారు. 12 ఏళ్ల బాలికను హత్య చేసి తగలబెట్టి చెత్త కుప్పలో పడేశారు. పురుగులు పట్టిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.. బాధిత కుటుంబాన్ని సోమవారం మంత్రి సీతక్క పరామర్శించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లక్ష్మ తండాకు చెందిన బాధిత బాలిక కుటుంబాన్ని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పరామర్శించి, జరిగిన సంఘటన పై వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.. రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.. రాష్ట్రంలో గంజా,మత్తు మాఫియాలను ఉక్కు పాదంతో అణిచివేస్తున్నామని అన్నారు.. డ్రగ్స్, గంజాయిని వల్ల వ్యక్తి యొక్క ఆరోగ్యంతో పాటు సమాజానికి సైతం నష్టం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఆగాయి త్యాలు జరగకుండా వాటి మూలలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. డ్రగ్స్, గంజాయి మాదకద్రవ్యాల వినియోగంపై పోలీసు శాఖ ఉక్కు పాదం మోపుతుందని మంత్రి తెలిపారు. జరిగిన సంఘనపై పూర్తి వివరాలు సేకరించి దోషులనులను శిక్షంచే విధంగా అధికారులను కోరారు. భావిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. బాధిత కుటుంబానికి అండగా ప్రభుత్వం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం బలరాం, ఎంఎల్ఏ రామచంద్రు నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అనాథలకు వాసవి క్లబ్‌ల అండ

**విశ్వంభర, అంబర్‌పేట్ :** వాసవి క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్, వాసవి వనిత అంబర్పేట చే నెంబర్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యానగర్లోని అనాథ బాల బాలికల ఆశ్రమంలో ప్రతి ఏటా నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం అందులో ఉండే విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ చేశారు. అంతేకాకుండా విద్యార్థులకు స్టేషనరీ సామాన్లు సైతం అందజేశారు. ఇరుకుల్ల నాగభూషణం, ఇరుకుల పద్మజ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సంస్థలు ఏవైనా మానవతా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతూ అనాథలను ఆదుకోవాలని సూచించారు. యువత ఇలాంటి కార్యక్రమాల్లో ముందుండి నడవాలని కోరారు. కార్యక్రమంలో వాసవి సంస్థ ప్రతినిధులు బోడ సాయి సూర్యప్రకాష్, చంద్రమోహన్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల పెంపునకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఓబీసీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గొంటి విక్రమ్ యాదవ్



**విశ్వంభర, బషీర్ బాగ్:** బీసీ కులగణన, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల పెంపునకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని బీఆర్ఎస్ ప్రేరేపిత బీసీ సంఘాల నాయకులు గుర్తించాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గొంటి విక్రమ్ యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణనకు జీవో నెం.26ను విడదల చేసి 150 కోట్ల నిధులను విడుదల చేసిందని తెలిపారు. బీసీల రేజర్వేషన్లను 33 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిన పార్టీలను వదిలి 42 శాతంకు పెంచేందుకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీపై బురద చల్లడం సరికాదన్నారు. బీసీ జనసమితి నేత రాజారాం యాదవ్ బీఆర్ఎస్ పార్టీ బీసీల రిజర్వేషన్లను తగ్గించినప్పుడు మాజీ సీఎం కేసీఆర్‌ను ఎందుకు ప్రశ్నించలేదని విమర్శించారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై ఉన్న సీలింగ్ సైతం ఎత్తివేస్తామన్న రాహుల్ గాంధీ హామీని బీసీ నాయకులు గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.

## నీట్ పరీక్షను రద్దు చేయాలి విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్



**విశ్వంభర, హైదరాబాద్ :** వైద్య విద్యా ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్ష అక్రమాల పుట్టగా మారిన నేపథ్యంలో తక్షణమే పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు బల్మూర్ వెంకట్, ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, విజేఎస్, పీడీఎస్‌యూ నాయకులు మహేష్, ధర్మేంద్ర యాదవ్, అరుణ్ లు నీట్ లో జరిగిన అక్రమాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అక్రమాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోడీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలు నిర్వహించే సంస్థను రద్దు చేయాలని కోరారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు నిరసనగా ఈనెల 18న హిమాయత్ నగర్ లిబర్టీ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు స్టూడెంట్ మార్చ్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే కేంద్ర మంత్రులైన కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ల నివాసాలను ముట్టడిస్తామని పేర్కొన్నారు.

## ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్



**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్‌నగర్ మినీ స్టేడియంలో మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా సాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి హాజరై గెలుపొందిన టీంలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్ 11 క్రికెట్ క్లబ్ అధ్యక్షులు రవి తేజ్, మతిన్, మున్నా,శివ కుమార్, ప్రధాన అధ్యక్షులు కబీర్ అహ్మద్‌ను అభినందించారు. ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహించాలని కోరారు. ఇండోర్ స్టేడియంకు ఎలాంటి సహాయ సహకారాలైనా ఎమ్మెల్యేతో మాట్లాడి మీకు అందిస్తామని అన్నారు. ఈ క్రికెట్ పోటీలను సమర్పించిన వారు గోపాల్ రెడ్డి, మహమ్మద్ ఎజాజ్, మహ్మద్ రవూఫ్, డేవిడ్ రాజ్, లక్ష్మిన్ యాదవ్, కేశవ్ యాదవ్, షరీఫ్ ఖాన్, శివాజీ, మధుసూదన్ గౌడ్, ఎండీ మహమ్మద్, హరి కుమార్ (కిషన్ నగర్ )సహకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నేత అలీం సఖీబ్, క్రికెట్ క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో నేత ముజీబ్‌కు బక్రీద్ శుభాకాంక్షలు



**విశ్వంభర, బషీర్ బాగ్:** బక్రీద్ పండుగ సందర్భంగా టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. ఎం హుస్సేనీ ముజీబ్‌కు టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్ రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్‌లు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపీ, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైదిక్ శాస్త్రి, బీ శంకర్, శ్రీధర్, వెంకటరెడ్డి, వహీద్, మహ్మద్, సత్యనార్య, మహేష్‌గౌడ్, రాంబాబు, మోహన్, శ్రీనివాస్ చౌష్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.



## కాళేశ్వర ఆలయ దర్శన వేళలు

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం, త్రిలింగ క్షేత్రాలలో ఒకటైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర ఆలయ దర్శన వేళలు పొడిగించినట్లు ఆలయ ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలంలో అధిక ఎండల వలన భక్తుల సౌకర్యార్థం మార్పు చేయడం జరిగినదని, ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వచ్చినందున దేవస్థానం దర్శన వేళలు పునరుద్ధరించడం జరిగినది అని ఆయన తెలిపారు. ఈ నెల 18 నుంచి దర్శన వేళలు ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు తిరిగి సాయంత్రం 4:00 గంటల నుంచి 6:00 గంటల వరకు భక్తులు దర్శనాలు, వివిధ పూజలు చేసుకొనవచ్చునని రాత్రి 8:00 గంటలకు ఆలయం మూసివేయడం జరుగుతుందని తెలిపారు.

## సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబాబు నాయక్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా అంగోతు రాంబాబు నాయక్‌ను ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యాలయంలో ఎన్నుకున్నారు. సోమవారం సేవాలాల్ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న సేవాలాల్ సేన ముఖ్యనాయకుల సలహాలు, సూచనలను అనుసరించి తాజా పరిణామాల పై త్రిసభ్య కమిటీ సమావేశమై అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి సమన్వయంతో సంఘ సిద్ధాంతాలను కట్టుబడి పనిచేయ్యాలని సూచిస్తూ.. మరోసారి రాంబాబు నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు నాయక్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో రెండవసారి సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినందుకు త్రి సభ్య కమిటీ సభ్యులకు దానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులకు , శ్రేయోభిలాషులకు, సేవాలాల్ సేన కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై స్పందించి తగు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## 'రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి'

**విశ్వంభర, చివ్వేంల :** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్న మధుకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా స్వల్ప ఓట్ల తేడాతో రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఓడిపోయారని ఆయన సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు భారీ మెజారిటీ అందించారని తెలిపారు. కాంగ్రెస్ అభివృద్ధికి, ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకునేందుకు తన ఆస్తులను సైతం అమ్మి ఖర్చు పెట్టిన వ్యక్తి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. 5 సార్లీ ఎమ్మెల్యేగా, 3 సార్ల మంత్రిగా పనిచేసి, పార్టీ అభ్యున్నతికి పాటుపడిన దామోదర్ రెడ్డికి ప్రజాప్రతినిధిగా మంచి అవకాశం కల్పించాలని కోరారు.



జనహృదయ నేత కూన శ్రీశైలం గౌడ్ కు ఆది జాంబవ అరుంధతి మాత మహా శక్తి పీఠంధిపతి గజ్జల రాజగురువు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
- విశ్వంభర, బషీర్ బాగ్

## ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా..



### ఆంధ్రప్రదేశ్ మంత్రి పార్థసారధి

**విశ్వంభర, నూజివీడు:** మన కొలుసు పార్థసారధి గారు మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత నూజివీడు ఆర్యవైశ్య సంఘ పెద్దలు నూజివీడు ఆరవ వార్డు సీనియర్ కౌన్సిలర్ అయిన కందుల సత్యనారాయణ గారు కొలుసు పార్థసారథి గారిని ఆదివారం సాయంత్రం నూజివీడు పీవీఎస్ఆర్ కళ్యాణమండపంలో సన్మానించారు.
తరువాత పార్థసారథి గారు కందుల సత్యనారాయణ గారిని కూడా సన్మానించారు. తరువాత కొంతమంది సంఘ పెద్దలు కూడా కొలుసు పార్థసారధి గారిని సన్మానించారు. ఇందులో భాగంగా పార్థసారథి గారు మాట్లాడుతూ నేను ఎప్పుడు ఎన్నికలలో పాల్గొన్న నామినేషన్ వేసే ముందు వాసవి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత నామినేషన్ వేయడానికి వెళ్తానని ప్రసంగించారు. నాకు ఆర్యవైశ్యులకు విడదీయరాని సంబంధం ఉన్నది. వారికి నేను ఎలక్షన్ ముందు ఎటువంటి మంచి చేయాలి అనుకున్నాను అవి అన్ని ఇంకా ఎక్కువగా చేస్తాను అని సభాపూర్వకంగా తెలియజేశారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టే విషయాలు ఏవి మీ దరికి చేరకుండా చేస్తాను అని వాగ్దానం చేశారు.

## ముగిసిన జగదీష్ రెడ్డి అభిమానుల పాదయాత్ర

- కాలినడకన వెళ్లి యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న జగదీష్ అన్న సైన్యం
- అభినందించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ ఎంపీ సంతోష్ బాబు




**విశ్వంభర, హైదరాబాద్ :** మాజీమంత్రి వర్యులు, సూర్యపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి గారు హ్యాట్రిక్ విజయం సాధించడంతో యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామికి తమ మొక్కులు చెల్లించుకునేందుకు ఆయన అభిమానులు చేపట్టిన పాదయాత్ర సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఎర్రవెల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను, అలాగే మాజీ ఎంపీ సంతోష్ బాబులను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ అభిమాన నాయకుడి గెలుపును ఆకాంక్షిస్తూ కాలినడకన మొక్కులు చెల్లించుకున్న జగదీష్ రెడ్డి అభిమానులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

## ఆరెంజ్ ఆస్పత్రిలో ప్రీటర్మ్ డెలివరీ బేబీ మొదటి పుట్టినరోజు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** రెంజ్ ఆసుపత్రి ఎల్బీనగర్‌లో ప్రీటర్మ్ డెలివరీ బేబీ మొదటి సంవత్సరం జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత సంవత్సరం ఫిబ్రవరి 17న ఉదయ్ కిరణ్, కవిత దంపతులు ఉమ్మినీరు తగ్గిపోయి గర్భసంచి తెరుచుకోగా తల్లి బిడ్డను సురక్షితంగాఉంచడానికి ఎవరూ.. హామీ ఇవ్వలేదని ఉదయ్ కిరణ్, కవిత తెలిపారు. ఇలాంటి స్థితిలో ఆరెంజ్ హాస్పిటల్ డాక్టర్ గౌతం గోరిటియాల చాలంజింగ్‌గా తీసుకొని సురక్షితంగా డెలివరీ చేసి తల్లి బిడ్డను కాపాడారని ఆనందం వ్యక్తం చేశారు. తమ సంతోషాన్నిపంచుకోవడానికి మొదటి జన్మదినోత్సవాన్ని ఆసుపత్రిలో నిర్వహిస్తున్నామని గర్వంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి మిస్ ఇండియా సుధా జైన్ పాల్గొని మాట్లాడుతూ.. అత్యాధునికమైన సౌకర్యాలతో వున్న మల్టీస్పెషల్టీ ఆరెంజ్ హాస్పిటల్ సేవలను కొనియాడారు. చిన్నారిని డాక్టర్లను అభినందిసత్కరించారు. అధునాతనమైన శస్త్ర చికిత్స సాంకేతికతో, నైపుణ్యం కలిగిన తమ డాక్టర్ల బృందం తల్లి బిడ్డను క్షేమంగా ఉంచడం గర్వంగా ఉందని డాక్టర్ గౌతమ్ గోరిటియాలా తెలిపారు. తల్లి బిడ్డలకుఇన్ఫెక్షన్ రాకుండా ఒక పద్ధతి ప్రకారం జాగ్రత్తలు తీసుకోవడంజరిగిందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ రాము, బిజినెస్ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో వరణుడు కరుణించాడు.. ఆదివారం రాత్రి వర్షం కురవడంతో సోమవారం రైతులు తమ పొలాల్లో పత్తి విత్తనాలను విత్తడంలో నిమగ్నమయ్యారు.. మరికొందరు మరో వర్షా నికి విత్తనాలను విత్తేందుకు, దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్నారు..**
- విశ్వంభర, భూపాలపల్లి



# హరీష్ రావు స్కామ్‌లు కూడా బయటకు వస్తాయి

- ఆయన అవినీతి బయటకు తీస్తాం
- ఆరు నెలల మా పాలనపై చర్చకు సిద్ధం
- తప్పుడు స్టేట్ మెంట్.. తప్పుడు ఆరోపణలు కాదు
- హరీష్ రావుకు ఎమ్మెల్సీ బల్మూరి సవాల్



**విశ్వంభర, హైదరాబాద్:** నిరుద్యోగ సమస్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ వెంకట్ బల్మూరి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుల పాలనలో ఎప్పుడు విద్యార్థి, నిరుద్యోగులకు అందుబాటులో లేరని ఫైర్ అయ్యారు. గత పాలనలో ప్రజా సమస్యలపై మాట్లాడిన వారిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీవో 55 రద్దు చేశామని,11,000 డీఎస్సీ పోస్టులు ఇచ్చామని గుర్తుచేశారు. పదేళ్లలో మీరు సృష్టించిన సమస్యలు పరిష్కారం చేస్తూ విద్యార్థులకు న్యాయం చేస్తున్నామని చెప్పారు. మీకు మీ బామ్మర్ది కి జరుగుతున్న గొడవలు బయటకు రాకుండా ఉండడం కోసం ఇవన్నీ సృష్టిస్తున్నారని విమర్శించారు. పదేళ్ల మీ పాలన.. ఆరు నెలల మా పాలన పై బహిరంగ చర్చకు మేము రెడీ.. అని సవాల్ చేశారు. హరీష్ రావు పేషీలో పని చేసిన ఒక వ్యక్తి స్కాం లో అరెస్ట్ అయ్యారని, సీఎంఆర్ఎఫ్‌లో జరిగిన అవినీతినీ కూడా బయటకు తీస్తామన్నారు. హరీష్ రావు మీరు చేసిన స్కామ్‌లు కూడా బయటికి వస్తాయని, ఇప్పటికే ప్రజా ప్రభుత్వంలో జూన్ 15వ తేదీ వరకు 75 వేల చెక్ లు రెడీ అయ్యాయన్నారు. 15 వేల చెక్‌లు లబ్ధిదారులకు అందచేయడం జరిగిందన్నారు. జాబ్ క్యాలెండర్ హామీ నీ నెరవేర్చుతామన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఎప్పటికప్పుడు ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. పేపర్ లీకేజి నిందితులను కఠినంగా శిక్షిస్తామని, ఇక్కడ పేపర్ లీకేజి చూసి.. అక్కడ పెద్దలు నీట్ పేపర్ లీకేజి చేశారన్నారు. హరీష్ రావు తప్పుడు స్టేట్ మెంట్.. తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని, సమస్యలు ఉంటే తనకు చెప్పాలన్నారు. సీఎం దగ్గరికి తాను తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని బల్మూరి వెంకట్ హామీ ఇచ్చారు.



## బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా సురేశ్‌రెడ్డి

### నియమించిన పార్టీ అధినేత కేసీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా రాజ్యసభ సభ్యుడు, సీనియర్ నేత కేఆర్ సురేశ్‌రెడ్డిని ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు నియమించారు. ప్రస్తుతం ఫ్లోర్‌లీడర్‌గా కే కేశవరావు కొనసాగుతుండగా.. ఆయన స్థానంలో కేఆర్ సురేశ్‌రెడ్డిని నియమిస్తున్నట్లు కేసీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్యసభ, లోక్‌సభ సెక్రెటరీ జనరల్స్‌కు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు విడివిడిగా లేఖ రాశారు. మొన్నటి వరకు ఫ్లోర్ లీడర్‌గా కొనసాగిన కే కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మాజీ మంత్రి పుష్పలీల

**విశ్వంభర, నాంపల్లి:** హైదరాబాద్‌ను బేస్ చేసుకుని బీజేపీ కుట్రలు పన్నుతోందని, అల్లర్లు సృష్టించాలనుకుంటోందని మాజీమంత్రి పుష్పలీల అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్ పుష్పలీల మాట్లాడారు. విద్యుత్ కొనుగోళ్ల స్కామ్‌లో అరెస్ట్ చేస్తారని మాజీ సీఎం కేసీఆర్ భయపడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ కవిత తనకు భయం అవుతుందని జైల్లో ఏడ్చారని బీఆర్ఎస్ నేతలే చెబుతున్నారని పుష్పలీల అన్నారు. దమ్ముంటే ఈవీఎంలను తీసేసి ఎన్నికలకు వెళ్లాలని రాహుల్ గాంధీ చెప్పారని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఆ ధైర్యం లేదని చెప్పారు. ఈవీఎంలు సరికాదని ఎలాన్ మస్క్ కూడా చెప్పారని అన్నారు. తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి తమ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నాయని పుష్పలీల చెప్పారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తమ ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు.



## ఈవీఎంలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి

### సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**విశ్వంభర, హైదరాబాద్:** ఈవీఎంలపై దేశ వ్యాప్తంగా చర్చ జరగాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అభిప్రాయపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలోని దాదాపు 122 దేశాలలో ఈవీఎంలను వాడుతున్నారని, అమెరికా జపాన్ దేశాలతో పాటు, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సైతం ఈవీఎంలను బ్యాన్ చేశారని, ఆయా దేశాల్లో పూర్తిగా పేపర్ బ్యాలెట్‌తో ఎన్నికలను నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. మరీ అతి పెద్దప్రజస్వామిక భారత దేశంలో ఎందుకు బ్యాలెట్ ద్వారా ఎన్నికలను నిర్వహించడం లేదో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజాస్వామ్యం నిలబడుతుందని అన్నారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే ఫలితాల ప్రకటనలో తప్పులు, అవకతవకలు జరిగే ప్రమాదముందని ఆరోపించారు.

# రాష్ట్రంలో రోజుకో మర్డర్, అత్యాచారం!

- లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడి తప్పింది
- సభ్య సమాజానికి తలవంపులు తెచ్చేలా ఘటనలు
- ఢిల్లీకి డబ్బులు పంపించే పనిలో బిజీ
- కాంగ్రెస్‌పై బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ విమర్శలు



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో రోజుకో మర్డర్, అత్యాచారం జరుగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోకపోగా కనీసం రివ్యూ కూడా చేపట్టలేదని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ విమర్శలు చేశారు. సోమవారం నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండ్రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో దారుణ ఘటన జరిగిందని, ఆరేళ్ళ బాలికపై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేశారని మండిపడ్డారు. సభ్య సమాజానికి తలవంపులు తెచ్చేలా ఈ ఘటన ఉందన్నారు. అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి గంజాయి మత్తులో ఉన్నారని తెలుస్తోందన్నారు. లా అండ్ ఆర్డర్ బాగుందని చెబుతున్న కాంగ్రెస్ నేతలకు ఇది చెంపపెట్టులాంటిదని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజుల క్రితమే నిందితుడు మిల్లులో చేరినట్లు తెలుస్తోందని, లేబర్ రికార్డులు కూడా మెయింటైన్ చేయని పరిస్థితి ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన రేవంత్ కు వలస జీవుల గురించి బాగా తెలుసని, కానీ 15 రోజుల క్రితం వలస వెళ్లిన కుటుంబానికి చెందిన చిన్నారిపై ఈ ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. వలసలు తగ్గాయని చెబుతున్న రేవంత్‌కు ఈ వలసలు కనిపించడం లేదా? అని పాల్వాయి ప్రశ్నించారు. రాష్ట్రంలో 8 నెలలుగా లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడి తప్పిందని, ఈ ఘటనతో అయిని రేవంత్ కు కనువిప్పు కలగాలని నిలదీశారు. కాంగ్రెస్‌లో ఇంటి తగాదా వల్ల రాష్ట్రానికి హెూంమంత్రి, విద్యాశాఖ మంత్రిని నియమించడం లేదని పాల్వాయి హరీశ్ విమర్శలు చేశారు. కేబినెట్ విస్తరణ చేపట్టి కూడా మంత్రిని నియమించే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హెూంశాఖ మంత్రిని నియమిస్తే కనీసం చర్యలు అయినా తీసుకునే వారని నిలదీశారు. సీఎం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీకి డబ్బులు పంపించే పనిలో బిజీ అయిపోయారని, ఇక మంత్రులు వాళ్ళ సంపాదనలో నిమగ్నమయ్యారని పాల్వాయి హరీశ్ ఆరోపణలు చేశారు. బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందని, నిందితునికి కఠిన శిక్ష వేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఇల్లు, రూ.20 లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ 8 నెలల్లో పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించలేదని, కొత్త ప్రభుత్వం వచ్చాక ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్ లకు జీతాలు కూడా లేవని మండిపడ్డారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బిల్డింగ్ శాఖలో కూడా బిల్లులు చెల్లించలేదన్నారు. మున్సిపాలిటీలకు కూడా 8 నెలలుగా ఒక్క రూపాయి రాలేదని మండిపడ్డారు. నాలాల సమస్యలు వస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ అన్ని అంశాలపై వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తుతామని పాల్వాయి హరీశ్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించలేదని రాష్ట్ర ప్రభుత్వం చెంపలేసుకుని తప్పును ఒప్పుకోవాలని పాల్వాయి హరీశ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో తప్పిదం జరిగిందని ఎన్టీఏ చెబుతోందని, మార్కుల కేటాయింపులో తప్పులు జరిగాయని చెబుతున్నారన్నారు. అలాంటిది జరిగితే చెక్ చేసి సరిచేస్తారని, అయినా అభ్యర్థులకు నమ్మకం లేకుంటే వారికి రీ టెస్ట్ కండక్ట్ చేస్తామన్నారు. అంతేకాని ప్రతిపక్షాలు బట్ట కాల్చి మీద వేయొద్దని పాల్వాయి హరీశ్ తెలిపారు.






**విశ్వంభర, డార్జిలింగ్ :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో డార్జిలింగ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. కంచన్‌జుంగా ఎక్స్‌ప్రెస్ రైలును వెనుక నుంచి వేగంగా వచ్చిన గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనతో రైలు వెనుక మూడు బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులు మరణించగా.. 60 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఒకే ట్రాక్ పైకి వచ్చిన రెండు రైళ్లు ఢీకొనడంతో ఓ బోగీ గాల్లోకి లేచింది. అస్సాంలోని సిల్చార్ నుంచి కోల్ కతా లోని సెల్దాకు కంచన్‌జుంగా ఎక్స్‌ప్రెస్ బయల్దేరింది. న్యూజల్‌పాయ్‌గుడి వద్ద ఆగింది. అక్కడి నుంచి బయలుదేరి కొద్దినిమిషాలకే రంగపాని స్టేషన్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గూడ్స్ రైలు ఎక్స్ ప్రెస్ రైలును ఢీకొట్టింది. దీంతో ఎక్స్ ప్రెస్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. ఓ బోగీ గాల్లోకి లేచింది. ప్రమాదం తీవ్రతకు గూడ్స్ రైలు బోగీలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాద సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ట్రాక్ పై నుంచి బోగీలను పక్కకు తప్పించే ప్రయత్నం చేస్తున్నారు.




# డార్జిలింగ్‌లో ఘోర రైలు ప్రమాదం

## 15 మంది మృతి, 60 మందికి తీవ్రగాయాలు

### కంచన్‌జుంగా ఎక్స్‌ప్రెస్ రైలును వెనక నుంచి ఢీకొట్టిన గూడ్స్ రైలు

- ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు రావడంతోనే ఘటన
- గాల్లోకి లేచిన బోగీ, పట్టాలు తప్పిన ఎక్స్ ప్రెస్ రైలు
- గూడ్స్ రైలు లోకో పైలట్ తప్పిదంతోనే ప్రమాదం
- ఘటనాస్థలానికి సీఎం మమత బెనర్జీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటన
- ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని నరేంద్రమోడీ తీవ్ర దిగ్భ్రాంతి
- సహాయక చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలకు రాహుల్ గాంధీ ట్వీట్



### ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

డార్జిలింగ్ రైలు ప్రమాద వార్త చాలా బాధ కలిగించిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

### వెంటనే పరిహారం ఇవ్వండి : రాహుల్ గాంధీ

పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ జిల్లాలో కాంచనజంగ ఎక్స్ ప్రెస్, గూడ్స్ రైలు ఢీకొన్న ప్రమాద ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ట్విట్టర్ వేదికగా స్పందించారు. కంచనిజం రైలు ప్రమాదంలో ప్రయాణికులు చనిపోవడం చాలా బాధించింది. తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు వెంటనే కోలుకోవాలని కాంక్షించారు. ప్రభుత్వం వెంటనే వారికి ప్రకటించిన మొత్తం ఎక్స్ గ్రేషియాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రమాద స్థలంలో రెస్క్యూ, సహాయ చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లలో రైల్వే ప్రమాదాలు పెరడగం మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. దీని ఫలితంగా ప్రయాణికుల ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతోందన్నారు. ఈ ప్రమాదమే ఇందుకు నిదర్శనమన్నారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా.. తాము నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. మోదీ ప్రభుత్వమే ఈ ప్రమాదాలకు కారణమని ఆరోపించారు.

## రైలు ప్రమాదంపై ప్రాథమిక దర్యాప్తు

రైలు ప్రమాదంపై అధికారులు ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాద ఘటనపై రైల్వే బోర్డు చైర్మన్ జయవర్మ సిన్హా మాట్లాడుతూ.. ప్రమాదానికి గల కారణాన్ని వెల్లడించారు. గూడ్స్ రైలు డ్రైవర్ (లోకో పైలట్) తప్పిదం కారణంగానే ఈ ఘోర ప్రమాదం జరిగిందని తెలిపారు. గూడ్స్ రైలు డ్రైవర్ సిగ్నల్ ను పట్టించుకోకుండా రైలును పోనివ్వడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ఈ ప్రమాదంలో లోకో పైలట్ తోపాటు కాంచనజంగా ఎక్స్ ప్రెస్ లోని గార్డు కూడా ప్రాణాలు కోల్పోయాడని అన్నారు. రైలు ప్రమాద ఘటనాస్థలిలో రెస్క్యూ ఆపరేషన్ పూర్తయింది. అగర్తలా %-% సీల్దా మార్గంలో అన్ని రైల్వే స్టేషన్ లలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయడం జరిగిందని జయవర్మ సిన్హా తెలిపారు. అయితే, రైలు ప్రమాదంపై విచారణ పూర్తయిన తరువాతే సరైన సమాచారం తెలుస్తుందని చెప్పారు. ప్రస్తుతానికి దర్యాప్తు కొనసాగుతుందని, పూర్తి వివరాలు సేకరించిన తరువాత ప్రమాదానికి అసలు కారణాలు ఏమిటనే విషయంపై స్పష్టత వస్తుందని చెప్పారు.

### సంఘటన స్థలానికి మమత బెనర్జీ..

ఘోర రైలు ప్రమాద ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ట్విటర్ వేదికగా ఆమె స్పందించారు. డీఎం, ఎస్పీ, వైద్యులు, అంబులెన్స్‌లు, విపత్తు బృందాలు రెస్క్యూ, రికవరీ, వైద్య సహాయంకోసం ఘటన స్థలాని కి చేరుకున్నాయి. యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించారని మమత పేర్కొన్నారు. ప్రమాద స్థలికి సీఎం మమత బెనర్జీ పరిశీలించారు.

### స్పందించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్..

బెంగాల్ లో రైలు ప్రమాద ఘటన దురదృష్టకరమని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. రైలు ప్రమాదం స్థలివద్ద యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రైల్వే, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారని తన ట్విటర్ ఖాతాలో మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

### ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల తరలింపు

మరోవైపు కాంచన్‌జంఘా ఎక్స్‌ప్రెస్ లో ఉన్న ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 10 బస్సులు ఏర్పాటు చేసినట్లు బంగాల్ ఆర్టీసీ ఛైర్మన్ తెలిపారు. ఈ బస్సులు ఘటన స్థలానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. సిలిగుడి - కోల్‌కతా వెళ్లడానికి మధ్యాహ్నం నుంచి అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ మధ్య కాలంలో రైలు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఒకే పట్టాలపై రెండు రైళ్లు రావడం, సిగ్నల్స్‌లో సమస్య తలెత్తడం, సిగ్నల్ జంప్ తదితర కారణాల వల్ల రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

### మృతులకు రూ.10 లక్షల పరిహారం

ఇదిలాఉంటే .. కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో మరణించిన ప్రతి కుటుంబానికి పిఎమ్ఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2లక్షలు, గాయపడిన ప్రతి ఒక్కరికి రూ. 50,000 ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని ప్రధాని మోదీ ప్రకటించారు. మరోవైపు రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు కేంద్ర మంత్రి రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 10లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 2.5లక్షలు పరిహారం ప్రకటించారు.

### రైల్వే మంత్రి రాజీనామా చేయాలి : ప్రమోద్ తివారీ

రైల్వే శాఖ సరైన నిర్వహణ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ అన్నారు. 'రైలు ప్రమాదాలు సరైన నిర్వహణ లేకపోవడం వల్లే జరగుతున్నాయి. ట్రాక్‌లపై భారం పెరుగుతోంది. కానీ భద్రత చర్యలు సరిగా చేపట్టం లేదు. ఇప్పటికే ఒడిశా రైలు ప్రమాదం నుంచి దేశం కోలుకోలేదు. ఈ లోపే మరో రైలు ప్రమాదం జరిగింది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగింది. రైల్వే మంత్రి రాజీనామా చేయాలి' అని ప్రమోద్ తివారీ అన్నారు.



## ఐసీయూలో తండ్రి..

### ఆస్పత్రిలో పెళ్లి చేసుకున్న కూతుళ్లు

**విశ్వంభర, లక్నో:** ఆ తండ్రి కోరిక నెరవేర్చడానికి కూతుర్లు ఏకంగా ఆస్పత్రిలోనే పెళ్లి చేసుకున్నారు. తండ్రి ఐసీయూలో ఉండటంతో.. చావుబతుకుల నడుమ కుమార్తెల పెళ్లి చూడాలనే కోరికను వారు ఇలా నెరవేర్చారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్ లోని లక్నోలో జరిగింది. మోహన్‌లాల్‌గంజ్ గ్రామానికి చెందిన 70 ఏళ్ల జునైద్ మియాన్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో ఆయన్ను ఐసీయూలో ఉంచి ట్రీట్ మెంట్ ఇచ్చారు. కాగా అంతకు ముందే కుమార్తెలు ఇద్దరికీ పెళ్లి సంబంధాలు కుదిరాయి. మరికొన్ని రోజుల్లో వివాహం ఉండగా ఇలా జరిగింది. దాంతో కుమార్తెలు తమ పెళ్లి చూడాలన్న తండ్రి కోరికను నెరవేర్చాలని అనుకున్నారు. దీంతో ముంబైకి చెందిన వరులు లక్నో చేరుకున్నారు. ఆదివారం జునైత్ కుమార్తెలు, వరులు నిఖా జరిపే మత పెద్ద, ఒకరిద్దరు బంధువులు మెడికల్ దుస్తులు ధరించారు. ఐసీయూలో తండ్రి ముందు పెళ్లి చేసుకున్నారు. ఇదంతా బంధవులు వీడియో తీయగా సోషల్ మీడియాలో వైరల్ గా మారిపోయింది. దాంతో తండ్రి కోరికను నెరవేర్చిన ఆ నలుగురిని అందరూ అభినందిస్తున్నారు.

## టెస్లాకారును హ్యాక్ చేయొచ్చు : రాజీవ్ చంద్రశేఖర్

**విశ్వంభర, ఢిల్లీ :** ఈవీఎంలు హ్యాకింగ్ కు గురవుతున్నాయని టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ చేసి ఆరోపణలు రాజకీయంగా తీవ్ర దుమారం రేగింది. ఈ ఆరోపణలపై కేంద్రమాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. ఈవీఎంలను హ్యాక్ చేసే ఛాన్స్ ఉందంటే.. టెస్లా కార్లను హ్యాక్ చేసే వీలుంటుందని మస్క్ కౌంటర్ ఇచ్చారు. "క్యాలిక్యులేటర్, ఎలక్ట్రానిక్ టోస్టర్నే తీసుకోండి.. వాటిని హ్యాక్ చేయలేం.. ఈవీఎంలు కూడా అలాంటివే" విమర్శించారు. ఈవీఎంలు కేవలం ఓట్లను లెక్కించి.. రిజల్ట్ ని స్టోర్ చేస్తాయని వివరించారు. తాను మస్క్ కాకపోయినప్పటికీ, సాంకేతికతపై తనకు కాస్త పరిజ్ఞానం ఉందన్నారు. ఈ ప్రపంచంలో అత్యంత సురక్షితమైన ఎలక్ట్రానిక్, డిజిటల్ పరికరమేదీ ఉండదన్నారు. టెస్లా కారునూ హ్యాక్ చేయొచ్చని ఎవరైనా చెప్పొచ్చు అని విమర్శలు గుప్పించారు. అమెరికా నియంత్రణలోని ప్యూర్టో రికోలో ఇటీవల నిర్వహించిన ప్రైమరీ ఎన్నికల్లో



అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఆందోళన వ్యక్తంచేసిన మస్క్.. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలను తొలగించడం ద్వారా హ్యాకింగ్ను నివారించొచ్చని సూచించారు. దీనిపైనే కేంద్ర మాజీమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. భారత ఈవీఎంలకు బ్లూటూత్, వైఫై, ఇంటర్నెట్ తో.. కనెక్టివిటీ ఉండదని, వీటిని రీప్రోగ్రామ్ చేయడం కూడా కుదరదని ఆయన బదులిచ్చారు.

## ఢిల్లీ ఎయిర్ ఫోర్ట్ లో పవర్ కట్..

### బోర్డింగ్, చెక్ ఇన్ సేవలకు బ్రేక్..!

**విశ్వంభర, ఢిల్లీ:** దేశ రాజధానిలో నీటి సమస్యతో పాటు విద్యుత్ సమస్య కూడా ఉందని సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. తాజాగా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు అరగంట పాటూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అంతరాయం కారణంగా బోర్డింగ్, చెక్ ఇన్ సేవలకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. చెక్-ఇన్ కౌంటర్ల వెలుపల క్యూలో ఎదురు చూపులు చూస్తూ.. అటు ప్రయాణికులు, ఇటు ఎయిర్ పోర్టు సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా, కరెంట్ పోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. తర్వాత పవర్ రావడంతో సేవలు తిరిగి కొనసాగించారు. అయితే, ప్రయాణికులు తీవ్ర అసహనం గురవ్వడంతో ఎక్స్ వేదికగా పవర్ కట్ వీడియోలు షేర్ చేస్తున్నారు. దాదాపు రెండు గంటలు క్యూలోనే ఉన్నామని ఓ నెటిజన్ ఢిల్లీ ఎయిర్ పోర్ట్ అధికారులు, ఎయిర్ ఇండియా సిబ్బందికి ఫిర్యాదు చేశారు.

## మంత్రులు కూడా కరెంట్ బిల్లు కట్టాల్సిందే

### అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ

**విశ్వంభర, అస్సాం:** అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నారు. అస్సాంలోని ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో ఉన్న అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు తాను కూడా ఉపయోగించుకున్న కరెంటు బిల్లుకు డబ్బులు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే జులై 1 వ తేదీ నుంచి ఈ నిబంధన అస్సాం రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి రానున్నట్లు హిమంత బిశ్వ శర్మ.. ట్విటర్ వేదికగా వెల్లడించారు. అస్సాంలో వీఐపీ సంస్కృతికి తెరదించుతున్నట్లు ప్రకటించిన సీఎం.. ఇక నుంచి ఉన్నతాధికారులైనా, ఎమ్మెల్యేలైనా, మంత్రులైనా.. చివరికి తానైనా.. కరెంటు బిల్లులను జేబులో నుంచే ఖర్చు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇలా చేయడం వల్ల విద్యుత్ సంస్థలు నష్టాల ఊబిలోకి కూరుకుపోకుండా ఉంటాయని.. కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం పడకుండా ఉంటుందని పేర్కొన్నారు. జులై 1 వ తేదీ నుంచి అస్సాంలోని ఉన్నత స్థాయి ప్రభుత్వోద్యోగులకు ప్రభుత్వం కరెంట్ బిల్లు చెల్లించదని హిమంత బిశ్వశర్మ తేల్చి చెప్పా రు.

## దక్షిణ గాజాలో పగటి పూట కాల్పుల విరామం

**విశ్వంభర, గాజా:** గాజాపై గత కొన్ని రోజులుగా విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్ ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది. దక్షిణ గాజాలోని రఫాలో పగటిపూట యుద్ధానికి విరామం ఇవ్వాలని నిర్ణయించింది. పాలస్తీనియన్లకు మానవతా సాయం అందేందుకు వీలుగా స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి ఏడు గంటలవరకు కాల్పులకు విరామం ప్రకటించింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ధ్రువీకరించింది. రఫా ప్రాంతంలోని 12 కిలోమీటర్ల మేర రహదారి వెంబడి ఈ వ్యూహాత్మక విరామం కొనసాగనున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. గత కొన్ని వారాలుగా మానవతా సాయం అందక, అల్లాడుతున్న పాలస్తీనియన్లను ఊరట లభించనుంది. తదుపరి నోటీసు ఇచ్చేవరకు ఈ విరామం కొనసాగుతుందని ఐడీఎఫ్ వెల్లడించింది.

విశ్వంభర V3 NEWS



# జగన్‌ది క్షమించారని తప్పు

- ఒక వ్యక్తి రాష్ట్రానికి శాపంగా మారాడు
- పోలవరం ప్రాజెక్టును గందరగోళం చేశారు
- సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు
- ప్రాజెక్ట్ అనేక సంక్షోభాలను ఎదుర్కొంది
- నానా అవస్థలు పడి ప్రాజెక్టు పనులు చేపట్టాం
- పోలవరం ప్రాజెక్టు సందర్శించిన సీఎం

**విశ్వంభర, పోలవరం:** ఏపీకి ఎంతో కీలకమైన పోలవరం ప్రాజెక్టు అనేక సంక్షోభాలను ఎదుర్కొందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం చంద్రబాబు తొలిసారిగా పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అధికారులతో పోలవరం ప్రాజెక్టు, స్పిల్ వే, కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులను అడిగి ప్రాజెక్టు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుపై టీడీపీ చిత్తశుద్ధితో ఉందన్నారు. తెలంగాణలోని ఏడు మండలాలను విలీనం చేసిన తర్వాతే ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని చంద్రబాబు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు కోసం తాను పడిన కష్టాన్ని జగన్ బూడిదలో పోసిన పన్నీరు చేశారని విమర్శించారు. 2005లో రాజశేఖర్ రెడ్డి ప్రాజెక్టు ప్రారంభించడం, అప్పట్లోనే అవకతవకలు జరగడం, కాంట్రాక్టర్ రద్దుతో ప్రాజెక్టు అటకెక్కిందని చంద్రబాబు అన్నారు. నానా అవస్థలు పడి పోలవరం ప్రాజెక్టు పనులు చేపట్టామన్నారు. ప్రాజెక్టు పూర్తయితే గుంటూరు, రాయలసీమ వరకు తాగునీరు అందుతుందన్నారు. చైనాలో ఉన్న త్రీ గార్జెస్ ప్రాజెక్టు తర్వాత అతిపెద్ద ప్రాజెక్టు పోలవరం అంటూ చంద్రబాబు తెలిపారు. 2014 నుంచి 2019 వరకు 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశామన్నారు. 31వ సారి ప్రాజెక్టును చూడడానికి వచ్చానని.. తన కష్టాన్ని బూడిదపాలు చేశారని మండిపడ్డారు. రాజకీయాలకు ఉండకూడని వ్యక్తి రాష్ట్రానికి ఒక శాపంగా మారారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం రాగానే రివర్స్ టెండరింగ్ చేపట్టారని.. ఏజెన్సీతో పాటు సిబ్బందిని మార్చారని సీఎం చంద్రబాబు అన్నారు. డయాఫ్రమ్ వాల్‌ను గత ప్రభుత్వం కాపాడుకోలేదన్నారు. ఈ ప్రాజెక్టుపై వంద సార్లు సమీక్షలు నిర్వహించామని.. రూ.446 కోట్లతో మరమ్మతులు చేసినా బాగవుతుందనే పరిస్థితి లేదన్నారు. సమాంతరంగా డయాఫ్రమ్ వాల్ కడితే రూ.990 కోట్లు ఖర్చవుతుందని.. గతంలో ప్రాజెక్టు కొనసాగి ఉంటే 2020 చివరినాటికి పూర్తయ్యేదన్నారు. పోలవరం పూర్తికి నాలుగు సీజన్లు కావాలని అధికారులు చెబుతున్నారని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అన్నీ సవ్యంగా జరిగితేనే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేందుకు నాలుగేళ్లు పడుతుందని అధికారులు అంటున్నారని చంద్రబాబు స్పష్టం చేశారు.



# రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తా

- ప్రజా దర్బార్‌ను అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తాం
- గంజాయి విక్రయాలకు చెక్ పెడుతాం
- మంత్రి నారా లోకేష్

**విశ్వంభర, మంగళగిరి:** రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా తీసుకురావాలో అధినేత చంద్రబాబు ఆదేశానుసారం పనిచేస్తానని మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్ర మంత్రి హోదాలో మొట్టమొదటిసారి తన సొంత నియోజకవర్గంలో పర్యటించిన నారా లోకేష్ బక్రీద్ సందర్భంగా మంగళగిరి ఈద్గాలో జరిగిన ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ పార్టీ నాయకులపై దాడులు కొనసాగుతున్నాయని, తమ మైనార్టీ నాయకులపై వైసీపీ ముకలు గాయపరిచి దాష్టీకానికి గురి చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఇంకా చార్జ్ తీసుకోలేదని, కానీ, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రతీ ప్రాజెక్టును పరిశీలిస్తున్నామన్నారు. తమ నాయకుడు చంద్రబాబు నాయుడు సమన్వయతో ఉండమని మమ్మల్ని కంట్రోల్ లో పెట్టారని అన్నారు. అందుకోసం తాను, శ్రేణులు నోరు మెదపడం లేదన్నారు. అలాగే రెడ్ బుక్ తన పని తాను చేసుకోబోతుందని సున్నితంగా హెచ్చరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు, మంగళగిరి నియోజకవర్గంలో పేదల కోసం ఇళ్ల నిర్మాణం చేస్తామని అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి తాను స్వయంగా కోరానని, ప్రణాళికాబద్ధంగా మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాన్నారు. అధికారంలోకి వచ్చాక కూడా వైసీపీ దాడుల్లో ముగ్గురిని కోల్పోయామని, సీఎం చంద్రబాబు ఆదేశాలతో సంయమనం పాటిస్తున్నామని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే మౌనంగా ఉంటున్నాం అన్నారు. తాను ఇంకా చార్జి తీసుకోలేదని.. కానీ, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రతి ప్రాజెక్టును పరిశీలించి.. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చే విధంగా పనిచేస్తా.. మా అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం పనిచేస్తానని తెలిపారు.

### రుషికొండ ప్యాలెస్ చిత్రాలు ఇంకా బయటపడాల్సివుంది

రుషికొండ ప్యాలెస్‌కు సంబంధించి ఇంకా చాలా చిత్రాలు బయటపడాల్సివుందని అన్నారు. రానున్న రోజుల్లో 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా గంజాయి విక్రయాలకు చెక్ పెడతామన్నారు. ప్రజా దర్బార్‌ను అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రుషికొండ ప్యాలెస్ వ్యవహారంలో బయటకు రావాల్సిన చిత్రాలు చాలా ఉన్నాయంటూ నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, దాదాపు రూ.500 కోట్ల ప్రజాధనంతో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రుషికొండలో భవనాలను నిర్మించారు. అయితే అందులో ఏం నిర్మించారు అనేది ఆదివారం వరకు బయటి ప్రపంచానికి తెలియదు. ఈ నేపథ్యంలో ఎన్డీయే కూటమి అధికారం చేపట్టాక రుషికొండకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఆదివారం టాక్ ఆఫ్‌ది టౌన్‌గా మారాయి. రుషికొండలో నిర్మించిన ఈ భవనాలను ముందు పర్యాటకం కోసం నిర్మించినట్లు వైసీపీ చెప్పగా, తాజాగా ఇవి పరిపాలన భవనాలు అని వైసీపీ నేతలు చెబుతున్నారు.

# స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు!

- జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి
- త్వరలోనే అధికారిక ప్రకటన
- రఘురామకృష్ణ నిరాశ మిగిలేనా
- అసెంబ్లీ సమావేశాలకు సర్కార్ సిద్ధం
- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక



**విశ్వంభర, అమరావతి:** ఏపీ శాసనసభ స్పీకర్ పదవి మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్న పాత్రుడికి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన పేరును ఖరారు చేసినట్లు తెలుస్తున్నది. జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వనున్నారు. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటికే సీఎం, మంత్రివర్గం ప్రమాణస్వీకారం. మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తి కాగా ఇప్పుడు స్పీకర్ ఎన్నికపై కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే ఏపీ స్పీకర్ పదవిని కూడా దాదాపు ఖరారు అయినట్టుగా తెలుస్తోంది. స్పీకర్‌గా ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు ని ఎంపిక చేయగా.. ఇక డిప్యూటీ స్పీకర్ పదవి జనసేనకు దక్కే అవకాశం ఉంది. డిప్యూటీ స్పీకర్ పదవి కోసం జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి పేరును పరిశీలిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ చీఫ్ విప్‌గా ధూళిపాళ్ల నరేంద్రను నియమించే ఛాన్స్ ఉందంటున్నారు. త్వరలోనే వీటిపై అధికారిక ప్రకటన ఉంటుందని చెబుతున్నారు.

### స్పీకర్ రేసులో పలువురి పేర్లు

ఈ నెల 19న ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఆ రోజు ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించేందుకు సభలో సీనియర్ ఎమ్మెల్యేను ప్రోటెం స్పీకర్‌గా ఎన్నుకుంటారు. అయితే రేపు స్పీకర్ పదవిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొదటి నుంచి స్పీకర్ రేసులో అయ్యన్నపాత్రుడు, నక్కా ఆనందబాబు, కళా వెంకట్రావు పేర్లు వినిపించాయి. జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, పంతం నానాజీలలో ఒకరిని డిప్యూటీ స్పీకర్‌గా నియమిస్తారని తెలుస్తోంది. దీనిపై జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సమాచారం. సీఎం చంద్రబాబు గత ఐదేళ్లుగా పార్టీ కోసం ఆయన చేసిన సేవలను గుర్తుంచుకొని అయ్యన్నపాత్రుడు వైపే మొగ్గుచూపినట్టుగా భావిస్తున్నారు. మరోవైపు చాలా కాలంగా వినిపిస్తున్న రఘురామకు ఏ పదవి ఇస్తారన్న చర్చ మొదలైంది. మంత్రివర్గంలో క్షత్రియ సామాజిక వర్గానికి చోటు దక్కలేదు కాబట్టి, టీటీడీ ఛైర్మెన్ పదవిని ఈ సామాజిక వర్గానికి ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ రేసులో అశోక్ గజపతిరాజు, రఘురామ పేర్లు వినిపిస్తున్నాయి. స్పీకర్ పదవిపై ఆశలు పెట్టుకున్న రఘురామకు చంద్రబాబు ఏ రకమైన న్యాయం చేస్తారో రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# జగన్ ఇంటికి ప్రైవేట్ సెక్యూరిటీ!

- హైదరాబాద్ కూల్చివేతలతో తాడేపల్లిలో అలెర్ట్
- భద్రత కోసం సెక్యూరిటీ పెంచుకున్న జగన్
- పహరా కాస్తున్న 30 మంది సెక్యూరిటీ గార్డులు



**విశ్వంభర, తాడేపల్లి:** ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ నివాసం ఉంటున్న తాడేపల్లిలోని ఇంటి దగ్గర ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసుకున్నారు. హైదరాబాద్ లోటస్ పాండ్‌లోని ఇంటి ఎదుట ఆక్రమణల తొలగింపు తర్వాత.. తాడేపల్లిలోని ఇంటి విషయంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. సీఎం హోదాలో ఇప్పటి వరకు హైదరాబాద్ లోటస్ పాండ్ ఇంటికి సైతం ఏపీ సర్కార్ సెక్యూరిటీ ఇచ్చింది. అదే విధంగా తాడేపల్లిలోని తన క్యాంప్ ఆఫీసుగా ఉన్న ఇంటికి కూడా ప్రభుత్వ సెక్యూరిటీ ఉండేది. జగన్ ఓడిపోయిన తర్వాత.. ఆ సెక్యూరిటీని తగ్గించింది. జగన్ ఇప్పుడు కేవలం ఎమ్మెల్యే మాత్రమే కావటం.. ప్రతిపక్ష హోదా కూడా లేకపోవటంతో.. నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేకు ఉండాల్సిన భద్రతను మాత్రమే ఏపీలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇస్తుంది. ఈ క్రమంలోనే తాడేపల్లిలోని ఇంటి దగ్గర భద్రత కోసం ప్రైవేట్ ఏజెన్సీకి చెందిన 30 మంది సెక్యూరిటీ గార్డులను నియమించుకున్నట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం ఉదయం ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది.. తాడేపల్లిలోని జగన్ ఇంట్లోకి వెళుతున్న వీడియో వైరల్ అయ్యింది. ఈ విషయాన్ని జాతీయ పత్రిక ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు చేయటంతో వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే విజయవాడ తాడేపల్లిలోని జగన్ ఇంటి ఎదుట ఉన్న రోడ్డుపై రాకపోకలను పునరుద్ధరించటం జరిగింది. అదే విధంగా సీఎంగా ఉన్నప్పుడు ఉన్న సెక్యూరిటీని తగ్గించటం జరిగింది. దీంతో తన భద్రత కోసం ప్రైవేట్ సెక్యూరిటీని జగన్ నియమించుకుంటున్నారు.

# అంతా తప్పుడు ప్రచారమే

- ఋషికొండ భవనాలపై టీడీపీ బురద చల్లుతుంది
- జగన్ కట్టుకున్నారని ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం
- కానీ అవన్నీ ప్రభుత్వ భవనాలే
- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్



**విశ్వంభర, విశాఖపట్నం:** రుషికొండపై ఉన్న ప్రభుత్వ కట్టడాలపై టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. అవి వైఎస్ జగన్ సొంత భవనాల్లాగా రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, రుషికొండ భావనలపై వాస్తవాలను ప్రజలను గమనించాలని కోరారు. విశాఖలో మీడియాతో మాట్లాడిన ఆయన నాలుగు నెలల క్రితమే రుషికొండ భవనాలను ప్రారంభించామని, ఆ భవనాలను ఎలా ఉపయోగించుకోవాలో ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్ విశాఖ వచ్చిన సందర్భంలో రుషికొండ భావనలను వినియోగించుకోవాలని సూచించారు. రుషికొండపై కట్టిన భవనాల్లో జగన్ మోహన్ రెడ్డి ఏమీ ఉండరు అని వ్యాఖ్యానించారు. విశాఖను రాజధానిగా ప్రకటన చేసిన తర్వాత రుషికొండ నిర్మాణంపై త్రీ మెన్ ఐఏఎస్ అధికారులతో కమిటీ వేశామని, కమిటీ ఒకే అన్న తరువాతే రుషికొండ భవనాలను నిర్మించారని తెలిపారు.

### శాశ్వత భవనాలు నిర్మించాం

టీడీపీ నేతలు వైఎస్ జగన్ మీద, వారి కుటుంబం మీద బురద జల్లాలని చూడడం ఎంతవరకు సమంజసం? అని మండిపడ్డారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ఎంత ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసన్న ఆయన.. హైదారాబాద్‌లో ఇల్లు నిర్మించుకునే సమయంలో చంద్రబాబు ప్రైవేట్ హోటల్ ఉండి కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని విమర్శించారు. అమరావతిలో చంద్రబాబు తాత్కాలిక భవనాలు నిర్మిస్తే.. వైఎస్ జగన్ రుషికొండ పై శాశ్వత భవనాలు నిర్మించారని తెలిపారు. టీడీపీ నేతలకు ధైర్యం ఉంటే వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూపించాలని సవాల్ చేశారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు ప్రజలను తప్పు తోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలని హితవుపలికారు. రుషికొండపై ఉన్నవి ప్రభుత్వ భవనాలు అని టీడీపీ నేతలు గుర్తించాలని కోరారు. గీతం యూనివర్సిటీ భూ ఆక్రమణలను గంటా శ్రీనివాసరావు చూపిస్తే బాగుండేదన్నారు.

### చంద్రబాబు ప్రజా ధనం దుర్వినియోగం చేయలేదా?

చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో హైదరాబాద్‌లో స్టార్ హోటల్‌లో ఉంటూ ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసింది మర్చిపోయారా? అని నిలదీశారు. విశాఖ రాజధానిని స్వాగతించిన గంటాకు నగరంలో ఒక్క ప్రభుత్వ అతిథి గృహం కూడా లేదన్న విషయం తెలియదా? స్థానిక శాసన సభ్యుడిగా రుషికొండ ఎదురుగా 25 ఎకరాలు ఆక్రమించుకున్న గీతం యూనివర్సిటీకి గంటా ఎందుకు తీసుకెళ్లలేదు.. ప్రభుత్వంపై ఆరునెలలు విమర్శలు చేయకూడదని అనుకున్నా టీడీపీ నేతలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. ఇక, కోడెల శివప్రసాద్ సామాగ్రి తరలింపునకు, మాజీ ముఖ్యమంత్రి జగన్ క్యాంప్ కార్యాలయ సామాగ్రికి పోలికే లేదన్నారు. ముఖ్యమంత్రిగా నివాసం ఉన్నారు కాబట్టి ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, ఫర్నిచర్ కు డబ్బులు కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు.

## ఫర్నిచర్ ఇంట్లో పెట్టుకోవడం దారుణం

- ఒప్పుకుంటే తప్పు ఒప్పవుతుందా?
- జగన్‌పై దేవినేని ఉమా ధ్వజం



**విశ్వంభర, అమరావతి:** కోట్ల రూపాయల ఫర్నిచర్‌ను మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన ఇంట్లో పెట్టుకోవడం పెద్ద ఎత్తున విమర్శలకు దారి తీస్తోంది. విపక్ష నేతలు దీనిపై విరుచుకు పడుతున్నారు. ఇంట్లో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌ను వేధించిన కర్మఫలం మాజీ సీఎం జగన్ రెడ్డిని వెంటాడుతోందని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వర రావు అన్నారు. సోమవా రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కోట్ల రూపాయల ఫర్నిచర్ ఇంట్లో పెట్టుకోవడం దారుణమన్నారు. ఒప్పుకుం టే తప్పు ఒప్పవుతుందా? అని దేవినేని ఉమ ప్రశ్నించారు. దొరికిపోయాక ఫర్నిచర్ ఇస్తాం.. రేటు కడతాం.. అంటే నాడు ఒప్పుకోని చట్టం నేడు ఎలా ఒప్పుకుంటుందని నిలదీశారు. ఫర్నిచర్‌కు కక్కుర్తి పడ్డ వాళ్ళు గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని ఏ విధంగా లూటీ చేశారో అర్థమవుతుందని దేవినేని ఉమ అన్నారు.



## ఏ సమస్యలు ఉన్నా తీరుస్తా

- నాకిచ్చిన శాఖలు కీలకమైనవి
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

**విశ్వంభర, విజయవాడ:** గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్య మా ప్రథమ ప్రాధాన్యమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా తన ఛాంబర్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేశారు. వేదమంత్రోచ్చారణ మధ్య గుమ్మడి సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గిరిజన హాస్టళ్లల్లో వర్షాలు కురిసినప్పుడు జబ్బులు బారిన పడుతున్నారని అన్నారు. దీనితో ఏఎన్‌ఎంలను గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వేస్తున్నామని, 544 పాఠశాలలో వారిని నియమిస్తున్నామని చెప్పారు. నాకిచ్చిన శాఖలు చాలా కీలకమైనవని అభిప్రాయపడ్డారు. శాఖలో ఇబ్బందులు తమకు తెలియజేయాలని, వాటిని పరిష్కరిస్తాను అని తెలిపారు మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. ప్రస్తుతం దగ్గరలో ఉన్న ఏఎన్‌ఎంలను డిపుటేషన్‌పై హాస్టళ్లకు పంపుతామన్నారు. ఐటీడీఏ, ఐసీడీఎస్‌లను కచ్చితంగా ప్రక్షాళన చేస్తున్నామని, అంగన్వాడీ సమస్యలు ఒక్కొక్కటి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు గిరిజన స్కూళ్లల్లో డ్రాప్ ఔట్లు ఎక్కువ అయ్యాయని, అలాంటి కాకుండా చూసుకుంటామన్నారు. కాగా ఏపీలో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారికి శాఖలు కేటాయించారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ఆ తర్వాత ఒక్కొక్కరు తమకు కేటాయించిన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్నారు.



## వైసీపీకి షాక్

- మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు రాజీనామా
- వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన
- పార్టీ అధ్యక్షుడు జగన్‌కు రాజీనామా లేఖ

**విశ్వంభర, ప్రకాశం జిల్లా:** వైఎస్సార్సీపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు రాజీనామా చేశారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు తన రాజీనామా లేఖను పంపారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిద్దా రాఘవరావు ఇప్పటివరకు తన భవిష్యత్ కార్యాచరణ గురించి ఎలాంటి ప్రకటనా చేయలేదు. శిద్దా రాఘవరావుది ప్రకాశం జిల్లా. వ్యాపారవేత్తగానూ ఆయన రాణించారు. టీడీపీ నుంచి 2014లో పోటీచేసి శిద్దా రాఘవరావు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు చంద్రబాబు నాయుడు మంత్రి పదవి ఇచ్చారు. అప్పట్లో ఆయన అటవీ శాఖతో పాటు పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రిగా చేశారు. 2024 ఎన్నికల్లో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి విజయం సాధించిన విషయం తెలిసిందే.

# టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా సఫారీ చిరుత!



**విశ్వంభర, స్పోర్ట్స్:** టీమిండియా ఫీల్డింగ్ కోచ్‌గా సౌతాఫ్రికా దిగ్గజం జాంటీ రోడ్స్‌ను నియమించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవి కాలం టీ20 ప్రపంచకప్ 2024తో ముగియనున్నది. హెడ్ కోచ్‌గా కొనసాగేందుకు రాహుల్ ద్రవిడ్ సుముఖంగా లేకపోవడంతో గత 'మే'లోనే బీసీసీఐ కొత్త కోచ్ ఎంపిక ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే హెడ్ కోచ్ పదవి కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. దరఖాస్తుల గడవు ముగిసి నెల రోజులు అవుతున్నా.. హెడ్ కోచ్ నియామకంపై మాత్రం బీసీసీఐ ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. మరోవైపు ఐపీఎల్ 2024 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టిన ఆ జట్టు మెంటార్ గౌతమ్ గంభీర్.. టీమిండియా హెడ్ కోచ్‌గా ఎంపికైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. టీ20 ప్రపంచకప్ 2024 ముగిసిన వెంటనే బీసీసీఐ అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది.

## టీమ్ రెడీ చేసుకుంటున్న గంభీర్

ఇక గంభీర్ తన కోచింగ్ టీమ్‌ను రెడీ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తనకు అత్యంత సన్నిహితుడైన జాంటీ రోడ్స్‌ను ఫీల్డింగ్ కోచ్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు 9 ఏళ్ల పాటు ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించిన జాంటీ రోడ్స్.. ప్రస్తుతం లక్నో సూపర్ జెయింట్స్ ఫీల్డింగ్ కోచ్‌గా కొనసాగుతున్నాడు. గౌతమ్ గంభీర్ లక్నోకు మెంటార్‌గా ఉన్న సమయంలోనే అతను ఆ జట్టులో చేరాడు. 2019లో జాంటీ రోడ్స్ టీమిండియా ఫీల్డింగ్ కోచ్ పదవి కోసం దరఖాస్తు చేసుకోగా.. అప్పటి హెడ్ కోచ్ రవిశాస్త్రి తిరస్కరించాడు. అప్పటి ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్ కాంట్రాక్ట్‌నే పొడిగించారు. రవి శాస్త్రి అనంతరం రాహుల్ ద్రవిడ్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా.. అతను తనకు అనుకూలమైన సపోర్ట్ స్టాఫ్‌ను నియమించుకున్నాడు. ఫీల్డింగ్ కోచ్‌గా తెలుగు తేజం టీ దిలీప్, బౌలింగ్ కోచ్‌గా పరాస్ మాంబ్రేను తెచ్చుకున్న ద్రవిడ్.. బ్యాటింగ్ కోచ్‌గా మాత్రం విక్రమ్ రాథోడ్‌ను కొనసాగించాడు.



# చరిత్ర సృష్టించిన ఇంగ్లాండ్!

**విశ్వంభర, స్పోర్ట్స్:** ప్రతిష్ఠాత్మక యూరో ఛాంపియన్‌షిప్‌లో మరో సంచలనం నమోదైంది. తొలి నాలుగు మ్యాచుల్లోనే 16 గోల్స్‌తో 48 ఏండ్ల రికార్డు బద్ధలైన చోట.. హ్యారీ కేన్ సారథ్యంలోని ఇంగ్లండ్ చరిత్ర సృష్టించింది. వరుసగా ఐదు విజయాలతో టోర్నీలో కొత్త అధ్యాయం లిఖించింది. సోమవారం సెర్బియాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 1-0తో జయకేతనం ఎగురవేసింది. దాంతో, 2020 నుంచి యూరో ఛాంపియన్‌షిప్ నాలుగు సీజన్లలో తొలి మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుగా ఇంగ్లిష్ టీమ్ రికార్డు నెలకొల్పింది. తద్వారా యూరో ఛాంపియన్‌షిప్ చరిత్రలోనే వరుసగా ఐదు విజయాలు సాధించిన తొలి జట్టుగా కొత్త చరిత్రను లిఖించింది.

ఇంగ్లండ్ జట్టు 2020 ఎడిషన్‌లో చెక్ రిపబ్లిక్‌కు చెక్ పెట్టిం ది. ఆ తర్వాతి సీజన్లలో వరుసగా స్కాట్లాం డ్, క్రొయేషియా, స్లొవేకియాలను చిత్తు చేసింది. తాజాగా జర్మనీలో జరుగుతున్న ఎడిషన్‌లో ఇంగ్లండ్ బలమైన సెర్బియాను మట్టికరిపించి సాకర్ పండుగ చరిత్రలోనే అరుదైన రికార్డు ఖాతాలో వేసుకుంది.

# చేతకాలేదని చెప్పండి..

**వర్షం అంటూ సాకులు కాదు**
**పాకిస్తాన్‌పై భారత మాజీ ప్లేయర్ సెహ్వాగ్**

**విశ్వంభర, స్పోర్ట్స్:** టీ20 వరల్డ్ కప్‌లో పేలవ ప్రదర్శనతో తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టిన పాకిస్థాన్‌పై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తీవ్రంగా విమర్శించాడు. వర్షం కారణంగా సూపర్-8కు అర్హత సాధించలేదనే సాకులు చెప్పొద్దని మండిపడ్డాడు. వచ్చే ప్రపంచకప్‌లో పాకిస్థాన్ తరపున బరిలోకి దిగాలనుకుంటే బాబర్ అజామ్ ఆటతీరును మార్చుకోవాలని అన్నాడు. లీగ్ స్టేజ్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడిన పాక్ నాలుగు పాయింట్లతో గ్రూప్-ఏలో మూడో స్థానంలో నిలిచింది. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌లో పాకిస్థాన్ ఓటమిపాలైం ది. తర్వాత భారత్ చేతిలో పరాజయాన్ని చవిచూ సింది. అనంతరం కెనడాపై విజయం సాధించి అదృష్టం కోసం ఎదురుచూసింది. అమెరికాపై ఐర్లాండ్ విజయం సాధించాలని, ఆ తర్వాత ఐర్లాం డ్‌ను ఓడించి తదుపరి దశకు చేరాలని ఆశించింది. కానీ వర్షం కారణంగా అమెరికా-ఐర్లాండ్ మ్యాచ్ రద్దైంది. దీంతో యూఎస్ఏ అయిదు పాయింట్లతో సూపర్-8కు క్వాలిఫై అయ్యింది. పాక్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.



బాజర్ ఆజామ్ కామెంట్స్ పై స్పందించిన ఆయన.. వర్షాన్ని ఎలా నిందిస్తారు? గెలిచినప్పటికీ తదుపరి దశకు వెళ్లే అర్హత పాకిస్థాన్‌కు లేదు. సూపర్-8 స్టేజ్‌లో పరాజయాలు చవిచూస్తారు. అక్కడ సులువైన ప్రత్యర్థి జట్లు లేవు. తొలిసారి ప్రపంచకప్ ఆడుతున్న అమెరికా చేతిలో ఓటమిపాలయ్యారని గుర్తుంచుకోండి. మెగాటోర్నీలో ముందు కు వెళ్లడానికి మీకు అర్హత లేదు. భారత్‌పై 120 పరుగుల లక్ష్యాన్ని కూడా ఛేదించలేకపోయారు. 113 పరుగులే చేసి చేతిలో వికెట్లు కూడా ఉంచుకున్నారు. ఇలాంటి ప్రదర్శనతో వర్షాన్ని నింది స్తారా? అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు వెళ్లిన తర్వా త బాబార్ అజామ్ సేన తమ ప్రదర్శన గురించి సమీక్షిం చుకోవాలి. పొట్టి ఫార్మాట్‌లో ముందుకు వెళ్లడా నికి ఏం చేయాలో ఆలోచిం చాలి. ప్రస్తుత పాకిస్థాన జట్టు ఫామ్‌ను చూస్తే.. మంచి వికెట్‌పై ప్రత్యర్థిపై పైచే యి సాధించలేదు. ఇక బాబర్ అజామ్ వచ్చే వరల్డ్ కప్‌లో ఆడాలంటే తన ఆటను మెరుగుపర్చుకోవాలి. టీ20 ఫార్మాట్‌కు సరిపోని బ్యాటర్లు బాబర్‌తో పాటు మరికొంతముంది జట్టులో ఉన్నారని టీమిండియా మాజీ ప్లేయర్ సెహ్వాగ్

# బీచ్‌లో టీమిండియా ఆటగాళ్ల ఎంజాయ్!





**విశ్వంభర, స్పోర్ట్స్:** టీ20 ప్రపంచకప్ 2024లో హ్యాట్రిక్ విజయాలతో సూపర్-8కు అర్హత సాధించిన టీమిండియా.. తొలి మ్యాచ్‌ను అఫ్గానిస్థాన్‌తో ఆడనుంది. జూన్ 20న బార్బోడస్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. లీగ్ దశలో ఐర్లాండ్, పాకిస్థాన్, అమెరికాను ఓడించిన టీమిండియా గ్రూప్-ఏ టాపర్‌గా సూపర్-8లోకి అడుగుపెట్టింది. ఈ మ్యాచ్ వేదిక అయిన బార్బోడస్‌కు ఆదివారమే చేరుకున్న టీమిండియా.. ప్రాక్టీస్ చేయకుండా అక్కడి బీచ్‌ల్లో సేదతీరుతుంది. ప్రత్యర్థి అఫ్గానిస్థాన్ అన్న అలసత్వమో.. లేక వెస్టిండీస్ పిచ్‌లపై అవగాహన ఉందనే ధీమానో తెలియదు కానీ.. ప్రాక్టీస్ మానేసి బీచ్‌లో వాలీబాల్ ఆడింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. జట్టులోని ఆటగాళ్లు ఇరు జట్లుగా విడిపో యి బీచ్ వాలీబాల్ ఆడారు. విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, రింకూ సింగ్, యశస్వి జైస్వా ల్ తమ సిక్స్ ప్యాక్ బాడీలను ప్రదర్శించగా.. శివమ్ దూబే, సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్, ఖలీల్ అహ్మద్ టీషర్ట్స్ తో ఆడారు. కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌లు ఈ బీచ్ వాలీబాల్ గేమ్‌కు దూ రంగా ఉన్నారు. ప్రాక్టీస్ మానేసి బీచ్ వాలీబాల్ ఆడటంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం టీమిండియా ఆటగాళ్లను సమర్థిస్తున్నారు. రిఫ్రెష్‌మెంట్ కోసం ఆటగాళ్లు సరదాగా గడపడం ముఖ్యమని, ఇదంతా ట్రైనింగ్‌లో భాగమేనని గుర్తు చేస్తున్నారు.



# రూ.2 వేలు తగ్గిన బంగారం ధర

**విశ్వంభర, బిజినెస్ :** గతవారం భారీ ర్యాలీని కొనసాగించిన పసిడి ధరలు కొత్త వారంలో ప్రజలకు స్వల్ప ఊరటను కల్పిస్తున్నాయి. సోమవారం బక్రీద్ పండుగ వేళ గోల్డ్ రేటు తగ్గటంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అనేక మంది తమ షాపింగ్ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. %వీబ్ఘుశ్రీ ఖీబంం%: రూ.లక్షను రూ.65 లక్షలు చేసిన మ్యూచువల్ ఫండ్ ఇదే.. 22 క్యారెట్ల పసిడి ధర 100 గ్రాములకు నిన్నటితో పోల్చితే ఏకంగా రూ.2000 పతనాన్ని నమోదు చేసింది. ఈ క్రమంలో దేశంలోని వివిధ నగరాల్లో రిటైల్ తగ్గిన విక్రయ ధరలను పరిశీలిస్తే గ్రాముకు.. చెన్నైలో రూ.6690, ముంబైలో రూ.6630, ఢిల్లీలో రూ.6645, కలకత్తాలో రూ.6630, బెంగళూరులో రూ.6630, కేరళలో రూ.6630, జైపూరులో రూ.6645, లక్నోలో రూ.6645, నాశిక్ లో రూ.6633, మంగళూరులో రూ.6630, అయోధ్యలో రూ.6645, గురుగ్రాములో రూ.6645, నోయిడాలో రూ.6645 వద్ద కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు 100 గ్రాములకు ధర నిన్నటితో పోల్చితే రూ.2200 క్షీణతను నమోదు చేసింది. దీంతో దేశంలోని వివిధ నగరాల్లో రిటైల్ తగ్గిన విక్రయ ధరలను పరిశీలిస్తే గ్రాముకు.. చెన్నైలో రూ.7298, ముంబైలో రూ.7233, ఢిల్లీలో రూ.7248, కలకత్తాలో రూ.7233, బెంగళూరులో రూ.7233, కేరళలో రూ.7233, జైపూరులో రూ.7248, లక్నోలో రూ.7248, నాశిక్ లో రూ.7238, మంగళూరులో రూ.7233, అయోధ్యలో రూ.7248, గురుగ్రాములో రూ.7248, నోయిడాలో రూ.7248గా ఉన్నాయి. ఏపీ-తెలంగాణలోని నగరాలైన విజయవాడ, గుంటూరు, కాకినాడ, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, గుంటూరు, కడప, విశాఖ, హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, నిజాంబాద్, వరంగల్ నగరాల్లో 22 క్యారెట్ల పసిడి నేటి ధర రూ.6,630గా ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.7,233 వద్ద కొనసాగుతోంది. అలాగే తాజా వెండి ధరలను తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ విక్రయ ధరను పరిశీలిస్తే.. ధర కేజీకి నేడు రూ.95,600 వద్ద కొనసాగుతోంది.

# ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం వార్నింగ్

- విధుల్లో సమయపాలన పాటించడం లేదని ఆగ్రహం
- లైవ్ లొకేషన్ డిటెక్షన్ అమలు చేయాలని ఆదేశం
- ఆలస్యంగా రావడం, ముందు వెళ్తే ఇకపై వారికి సీఎల్
- ఎండీఓల హెచ్‌ఓడీలు అంటెండెన్స్ బాధ్యతలు
- కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్ర మంత్రిత్వ శాఖ



**విశ్వంభర, బిజినెస్ :** ఏళ్లతరబడి ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగిపోయిన ఓ అలవాటును మార్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమైంది. అందుబాటులో ఉండని సిబ్బందిపై కొరడా ఝుళిపించేందుకు రెడీ అయింది. పలు కొత్త నిబంధనలను ప్రవేశపెడుతూ నిర్ణయం తీసుకుంది. పాటించని వారిపై తీవ్ర చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని స్పష్టం చేసింది. సమయపాలన పాటించని ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. కార్యాలయానికి ఆలస్యంగా హాజరుకావడం, ఆఫీసు నుంచి త్వరగా బయలుదేరడం అలవాటుగా మారిన అధికారుల ప్రవర్తనను తీవ్రంగా పరిగణించాలని పేర్కొంది. అనేక మంది ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్‌లో తమ హాజరును నమోదు చేయడం లేదని, కొంతమంది ఉద్యోగులు రోజూ ఆలస్యంగా వస్తున్నారని గుర్తించిన తర్వాత చర్యలకు ఉపక్రమించింది.

## లైవ్ లొకేషన్ డిటెక్షన్ తప్పనిసరి

లైవ్ లొకేషన్ డిటెక్షన్ మరియు జియో-ట్యాగింగ్ అందించే మొబైల్ ఫోన్ ఆధారిత ఫేస్ అథెంటికేషన్ సిస్టమ్‌ను ఉపయోగించాలని సిబ్బంది మంత్రిత్వ శాఖ ఒక ఆర్డర్‌లో సూచించింది. ఈబీఏఎస్ అమలును ఇటీవల సమీక్షించామని, సిబ్బంది అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెప్పింది. అన్ని మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌లు మరియు సంస్థలు(ఎండీఓ) ఉద్యోగుల హాజరు నివేదికలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించింది. ఎండీఓల హెచ్‌ఓ డీలు అందరూ తమ ఉద్యోగుల హాజరుకు సంబంధించి www.attendance.gov.in పోర్టల్ నుంచి కన్సాలిడేటెడ్ రిపోర్ట్‌ను రోజూ డౌన్‌లోడ్ చేసి, డీఫాల్టర్లను గుర్తించాలి అని కేంద్రం తన ఆర్డర్‌లో పేర్కొంది. ఆలస్యంగా హాజరైన ప్రతి రోజుకు సగం రోజు క్యాజువల్ లీవ్ (సీఎల్) డెబిట్ చేయబడాలని తెలిపింది. నెలలో 2 సందర్భాలు మించకుండా 1 గంట వరకు ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతించాలని సూచించింది. అయితే అందుకు కారణం సమర్థించదగినదిగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలు పాటించని పక్షంలో క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలని తేల్చి చెప్పింది. 'ముందస్తుగా బయలుదేరడం కూడా ఆలస్యంగా వచ్చినట్లుగానే పరిగణించబడుతుంది. ముఖ్యమైన అసైన్‌మెంట్‌లు, శిక్షణలు, డిప్యుటేషన్‌లు, బదిలీలు, పోస్టింగ్‌ల వేళ సదరు ఉద్యోగి సమయపాలన మరియు హాజరు డేటాను కూడా పరిగణనలోకి తీసుకోవాలి' అని కేంద్రం తెలిపింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) రూపొందించిన ఆండ్రాయిడ్/ఐఓఎస్ ఆధారిత ఫోన్‌లను ఉపయోగించి ఫేస్-బేస్డ్ అథెంటికేషన్ అప్లికేషన్‌ల వినియోగాన్ని కూడా హైలైట్ చేసింది.

# వాహనదారులకు ఎన్‌సీడీఆర్‌సీ అలర్ట్

**విశ్వంభర, బిజినెస్ :** ఏవైనా అనుకోని ప్రమాదాలు జరిగిన సమయంలో కొంతమేర నష్టాలను తగ్గించుకునేందుకు వాహన బీమా కొనుగోలు చేస్తుంటారు. అయితే ఆయా వాహనాలను తిరిగి వేరొకరికి విక్రయించే వేళ జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. తద్వారా లేని సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని వాహనదారులను హెచ్చరించింది. వాహ నాల కొనుగోలు సమయంలో వాటిపైన బీమా పాలసీని సరిగ్గా బదిలీ చేయాల్సిందేనని శ్రీ సుభాష్ చంద్ర అధ్యక్షత వహించిన జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ తేల్చి చెప్పింది. సరైన విధానాన్ని అనుసరించని పక్షంలో బీమా విషయమై సదరు జారీ కంపెనీ బాధ్యత వహించదని స్పష్టం చేసింది. తమ ముందుకు వచ్చిన ఓ కేసులో ఇదే తరహా ఆదేశాలు ఇచ్చింది. వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి 20 లక్షలు వెచ్చించి స్కోడా కారును కొనుగోలు చేశారు. కొంతకాలం తర్వాత 11.26 లక్షలకు మరొకరికి విక్రయించారు. అనంతరం ఫిర్యాదుదారు ప్రీమియం చెల్లించి తమ పేరుకు పాలసీని బదిలీ చేయాలని అభ్యర్థించారు. కానీ కంపెనీ కారు అసలు యజమాని పేరిట బీమా జారీ చేసింది. అదే కారు ప్రమాదానికి గురి కావడంతో పాలసీలోని వ్యక్తి పేరు గురించి ఫిర్యాదుదారు బీమా సంస్థకు తెలియజేశారు. అయితే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇప్పటికీ అసలు యజమాని పేరుమీదే ఉండటంతో అలా చేసినట్లు స్పష్టం చేసింది.

దీంతో కారు రిపేరు కోసం 21.36 లక్షలు ఖర్చు అయ్యాయని, వాటిని రిలీజ్ చేయాలంటూ ఫిర్యాదుదారు చేసిన క్లెయిమ్‌ను బీమా కంపెనీ తిరస్కరించింది. రిపేర్ ఖర్చులు, ఇతర నష్టాలకు పరిహారం కోరుతూ ఫిర్యాదుదారు రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయపరమైన సవాళ్లను పేర్కొంటూ రాష్ట్ర కమిషన్ ఫిర్యాదును తోసిపుచ్చగా.. జాతీయ కమిషన్‌లో రివిజన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. కాగా అదే కారణంతో జాతీయ కమిషన్ అప్పీల్‌ను తోసిపుచ్చింది. ఈ తరహా కొనుగోళ్లలో బీమా బదిలీకి సంబంధించి జాగ్రత్త వహించాలని సూచించింది.

## ప్రభాస్ 'కల్కి ఏడీ ' ఫస్ట్ సింగిల్ విడుదల

**విశ్వంభర, సినిమా :** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన సినిమా 'కల్కి ఏడీ 2898'. ప్రభాస్తోపాటు దీపికా పదుకొణె, దిశా పటానీ, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను ఈనెల 27వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ వేగవంతం చేశారు. ఇప్పటికే ఈ సినిమా టీజర్, ట్రైలర్‌ను విడుదల చేయగా యూట్యూబ్‌లో ఆ రెండు వీడియోలు మిలియన్ వ్యూస్‌తో దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాలోని ఓ పాటను విడుదల చేశారు. ఫస్ట్ సింగిల్ 'భైరవ యాంథెమ్' ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ పాటను ప్రముఖ పంజాబీ గాయకుడు, నటుడు దిల్జిత్ దోసంత్ పాడారు. సంతోశ్ నారాయణన్ మ్యూజిక్ అందించారు. ఈ చిత్రం మ్యూజిక్ రైట్స్‌ను ప్రముఖ మ్యూజిక్ లెబెల్ అయిన సరిగమ సొంతం చేసుకుంది.




## అభిమాని ఆత్మహత్యపై సోనాలి బింద్రే ఎమోషనల్!

**విశ్వంభర, సినిమా :** టాలీవుడ్‌లో ఎంతోమంది అగ్రహీరోలతో నటించిన హీరోయిన్లలో సోనాలి బింద్రే ఒకరు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సోనాలికి చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడిన ఈ హీరోయిన్ చాలా కాలం సినిమాలకు దూరంగా ఉంది. ఎట్టకేలకు ఇటీవల కోలుకుని తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. పలు డ్యాన్స్‌షోలకు జడ్జిగా వ్యవహరిస్తోంది. అదేవిధంగా చాలా కాలం తర్వాత 'ది బ్రోకెన్ న్యూస్' సీజన్ –2లో సిరీస్‌లో ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో సోనాలి బింద్రే తన ఫ్యాన్స్ గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయింది. గతంలో ఓ అభిమాని సోనాలిని చూడలేకపోయినందుకు ఆత్మహత్య చేసుకున్నాడని యాంకర్ తెలుపగా సోనాలిబింద్రే స్పందించింది. "నిజంగా ఈ సంఘటన జరిగిందంటే నమ్మలేకపోతున్నా. ఇప్పటి వరకు నాకు ఈ విషయం తెలియదు. నన్ను చూడలేకపోయినందుకు ప్రాణాలు తీసుకోవడమనేది బాధాకరమైన విషయం. నాకు కొన్ని మెయిల్స్, లెటర్స్ వస్తుంటాయి. అందులో కొన్ని రక్తంతో రాసినవీ వచ్చేవి. ఒక మనిషి తనలాంటి మరో మనిషి కోసం ఎందుకంత తాపత్రయపడతారో నాకైతే అర్థం కావడంలేదు. నేను ఎవరినీ ఇంతలా అభిమానించలేదు" అని తెలిపింది.





## మహేశ్ మేనకోడలిని చూశారా.. హీరోయిన్లు కూడా పనికిరారు..

విశ్వంభర, సినిమా : సూపర్ స్టార్ మహేశ్ బాబు గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఆయన ఇప్పుడు టాలీవుడ్ లో అగ్ర హీరోగా రాణిస్తున్నారు. ఇక ఆయన ఫ్యామిలీ నుంచి కూడా కొందరు నటులు ఉన్నారు. ఇప్పుడు త్వరలోనే ఆయన ఫ్యామిలీ నుంచి ఓ హీరోయిన్ రాబోతోందని అంటున్నారు. ఆమె ఎవరో కాదండోయ్.. మహేశ్ బాబు అక్క మంజుల కూతురు. మంజుల గతంలో హీరోయిన్ గా కొన్ని సినిమాలు చేసింది. ఆ తర్వాత నటిగాకూడా చేసింది. ఆరంజ్, సేవకుడు, మళ్ళీ మొదలైంది, హంట్, మంత్ ఆఫ్ మధు లాంటి సినిమాల్లో ఆమె నటించారు. అయితే ఆమెకు ఒకే ఒక సంతానం ఉంది. ఆమె కూతురు పేరు జాహ్నవి. హీరోయిన్లను సైతం తలదన్నే అదం జాహ్నవి సొంతం. ప్రస్తుతం జాహ్నవికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇది చూసిన వారంతా ఆమె ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం టీనేజ్ లో ఉన్న అమ్మడు చదువు పూర్తి అయ్యాక నటన వైపు అడుగులు వేసే అవకాశం ఉందని అంటున్నారు.

## కొత్త బిజినెస్‌లోకి అడుగుపెట్టిన హీరో నితిన్

**విశ్వంభర, సినిమా :** సినీ ఇండస్ట్రీ రంగుల ప్రపంచం లాంటిది. ఎవరికి ఎప్పుడు సక్సెస్ వస్తుందో.. ఎప్పుడు ఫెయిల్యూర్ వస్తుందో చెప్పలేం. దీంతో హీరో, హీరోయిన్లు అటు సినిమాలు చేస్తూనే వ్యాపారం వైపు దృష్టి పెడుతున్నారు. వరుస సినిమాలు చేస్తూనే కొత్త వ్యాపారాలను మొదలు పెట్టి సక్సెస్ అందుకుంటున్నారు. ఇప్పటికే అల్లు అర్జున్, మహేష్ బాబు వ్యాపారంలో సక్సెస్ అయ్యారు. తాజాగా యంగ్ హీరో నితిన్ అదే బాటను ఎంచుకున్నాడు. అయితే, ఈ హీరో మల్టీప్లెక్స్ బిజినెస్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. నితిన్ ఏషియన్ సంస్థతో కలిసి ఏఎన్ఎస్ అనే మల్టీప్లెక్స్ ప్రారంభించనున్నట్లు సమాచారం. నితిన్‌కు ఇదివరకే సితార పేరుతో ఒక థియేటర్ ఉంది.. ప్రస్తుతం ఈ థియేటర్‌ను రేనోవేషన్ చేస్తున్నారు. అయితే ఇదే థియేటర్‌ను ఏషియన్ సంస్థతో కలిసి సరికొత్త హంగులతో మల్టీప్లెక్స్ నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ మల్టీప్లెక్స్‌కు ఏసియన్ సితార మల్టీ ఫ్లెక్స్ అనే పేరు పెడుతున్నట్లు నెట్టింట వార్తలు వినిపిస్తున్నాయి.




# మానవాళిపై మరో వైరస్ దాడి..

- జపాన్‌లో వేగంగా ఎస్‌టీఎస్ఎస్ వ్యాధి వ్యాప్తి..
- వ్యాధి సోకిన 48 గంటల్లో మరణం
- జంతువులు, గాయాల ద్వారా సోరస్ సంక్రమణ
- వాపు, హై ఫీవర్, దద్దుర్లు , చర్మం పొట్టుగా రాలడం, బీపీ డౌన్ వ్యాధి లక్షణాలు

**విశ్వంభర, ఫీచర్ :** మానవాళిపై వైరస్‌లు ఓ రేంజ్‌లో పగబట్టినట్లు ఉన్నాయి. ఏ సమయంలో కరోనా వైరస్ వెలుగులోకి వచ్చిందో.. అప్పటి నుంచి ప్రపంచంలో ఏదోక చోట ఏదోక కొత్త వైరస్ కనిపిస్తూ.. లేదా పాత వైరస్‌లు మళ్ళీ ప్రబలుతు మనుషులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. తాజాగా ఆసియా దేశమైన జపాన్‌లో ఓ ప్రాణాంతక వ్యాధి వేగంగా విస్తరిస్తోంది. ఈ వ్యాధి బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఈ బ్యాక్టీరియా మానవ శరీరంలోకి ప్రవేశించి కణజాలాలపై దాడి చేస్తుంది. వ్యాధిని గుర్తించి సకాలంలో చికిత్స అందకపోతే.. వ్యాధి సోకిన 48 గంటల్లోపే రోగి మరణిస్తాడు. ఈ వ్యాధి పేరు స్ట్రెప్టోకోకల్ టాక్సిక్ షాక్ సిండ్రోమ్ (ఎస్‌టీఎస్ఎస్). జపాన్‌లో 900 కంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయి. జపాన్‌తో పాటు, యూరప్‌లో కూడా ఈ వ్యాధి కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఎస్‌టీఎస్ఎస్ వ్యాధి అంటే ఏమిటి? ఇది ఎలా వ్యాపిస్తుంది మరియు రోగి 48 గంటల్లో ఎందుకు మరణిస్తాడు? ఈ వైరస్ గురించి నిపుణులు ఏమి చెబుతున్నారో తెలుసుకుందాం..

### జంతువుల నుంచి వ్యాప్తి



ప్రపంచవ్యాప్తంగా అనేక రకాల బ్యాక్టీరియాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ బ్యాక్టీరియాలలో ఒకటి స్ట్రెప్టోకోకస్, ఇది మానవులకు సోకుతుంది. ఈ బ్యాక్టీరియా జంతువు లేదా కీటకాల నుంచి వచ్చి మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఈ బ్యాక్టీరియా రక్తం, కణజాలాలలోకి ప్రవేశించి వాటి పనితీరును పాడు చేస్తుంది. సకాలంలో చికిత్స అందకపోతే.. రోగి 48 గంటల్లో మరణిస్తాడు.

### ఈ వ్యాధి ఎలా వస్తుంది?

గాయం లేదా చిన్న కోత ద్వారా ఎస్‌టీఎస్ఎస్ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుందని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో డాక్టర్ జుగల్ కిషోర్ వివరిస్తున్నారు. ఈ బ్యాక్టీరియా శరీరంపై గాయాలు లేదా కాలిన గాయాలు ఇలా ఏదైనా శరీరంపై భాగంలో ఉంటుంది. ఇదే పద్ధతిలో ధనుర్వాతం కలిగించే బ్యాక్టీరియా కూడా శరీరంలోకి ప్రవేశిస్తుంది. అయితే ఎస్‌టీఎస్ఎస్‌తో బాధపడుతున్న వారిలో సగం మంది బాధితుల శరీరంలోకి బ్యాక్టీరియా ఎలా ప్రవేశించిందో నిపుణులకు తెలియడం లేదు. అయితే ఈ బ్యాక్టీరియా ఒకరి నుంచి మరొకరి వ్యాపించడానికి ఖచ్చితంగా గాయాలు ఒక మార్గం అని.. ఇలా బాధితులుగా మారిన రోగులు ఉదాహరణలు నిలుస్తున్నారని చెప్పారు. ఈ బాధితుల్లో లక్షణాలు ఏమిటంటే.. గాయం వేగంగా అభివృద్ధి చెందుతుంది. శరీర భాగాలలో వాపు, హై ఫీవర్, దద్దుర్లు , చర్మం పొట్టుగా రాలడం, బీపీ డౌన్. అయితే స్ట్రెప్టోకోకల్ టాక్సిక్ షాక్ సిండ్రోమ్ అనేది కొత్త వ్యాధి కాదు. జపాన్‌లో గతంలో కూడా ఈ వైరస్ కేసులు నమోదయ్యాయి. ఎస్‌టీఎస్ఎస్ అనేది బాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి కనుక దీనిని పూర్తిగా నివారించలేమని నిపుణులు చెబుతున్నారు.

### 48 గంటల్లో మరణం ఎలా సంభవిస్తుందంటే

ఈ బాక్టీరియా శరీరంలోకి ప్రవేశించినప్పుడు రోగి విపరీతమైన జ్వరంతో పాటు లో బీపీతో బాధపడతారని ఢిల్లీలోని ఆర్ఎంఎల్ ఆసుపత్రి నివాసి డాక్టర్ అంకిత్ రావత్ చెప్పారు. కణజాలం చనిపోవడం ప్రారంభించే విధంగా బ్యాక్టీరియా దాడి చేస్తుంది. దీని కారణంగా రోగి శరీరంలోని ఏదైనా భాగం విఫలమవుతుంది. ఈ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి కణజాలంపై దాడి చేయడానికి కొన్ని గంటలు మాత్రమే పడుతుంది. ఈ సమయంలో చికిత్స పొందకపోతే, అవయవం విఫలమవుతుంది. మరణానికి దారితీస్తుంది. ఈ బ్యాక్టీరియా గుండె, కిడ్నీ, కాలేయం వంటి ఏదైనా అవయవం మీద దాడి చేస్తుంది. ఈ వైరస్ కణజాలాన్ని నాశనం చేయడం ప్రారంభిస్తుంది. కనుక దీనిని మాంసం తినే బ్యాక్టీరియా అంటారు.

### ఈ వైరస్ ఎవరికీ ఎక్కువ ప్రమాదం అంటే?

ఇతర వ్యాధుల మాదిరిగానే పిల్లలు, వృద్ధులలో ఎస్‌టీఎస్ఎస్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి చాలా సందర్భాలలో 50 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి సోకుతుంది. శరీరంపై గాయాలతో ఉన్న వ్యక్తులలో ఎస్‌టీఎస్ఎస్ ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న వారు లేదా వైరల్ ఇన్ఫెక్షన్ ఉన్నవారికి ఈ వైరస్ సోకే అవకాశం ఉంది.

### ఈ వ్యాధి లక్షణాలు ఏమిటంటే

- గొంతు మంట
- శరీరంలోని ఏదైనా భాగంలో వాపు
- నోటిలో ఎరుపు, ఊదా మచ్చలు
- శోషరస కణుపుల వాపు

### బాధితులను ఎలా గుర్తించాలంటే

వ్యాధి నిర్ధారణకు నిర్దిష్ట పరీక్ష లేదు. వ్యాధి సోకిన ప్రాంతంలో రోగి ఈ మూడు లక్షణాలను కనిపిస్తే అప్పుడు డాక్టర్ రోగి బ్లడ్ శాంపిల్ ను తీసుకొని వివిధ పరీక్షలు నిర్వహిస్తారు. లక్షణాల్లో ముఖ్యంగా లో బీపీని పరిగణలోకి తీసుకుని .. రోగికి ఒకటి కంటే ఎక్కువ అవయవాల్లో సమస్య ఉంటే పరీక్షిస్తారు.

### ఎలా రక్షించాలంటే

- గాయం చుట్టూ చికాకు అనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి
- తరచుగా చేతులు కడుక్కుంటూ ఉండాలి
- తీవ్ర జ్వరం ఉంటే వైద్యుడిని సంప్రదించాలి
- వ్యాధి బాధితులున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి

## ఏం తినకపోయినా బరువు పెరిగిపోతున్నారా..?



**విశ్వంభర, ఫీచర్ :** ఈరోజుల్లో వెయిట్ పెరగడం అనేది అందరిని వేధించే సమస్య. ఇష్టం వచ్చినట్లు ఏదిపడితే అది తింటే బరువు పెరిగే వాళ్లు కొందరైతే.. పాపం ఏం తినకపోయినా కొందరు బరువు పెరిగిపోతుంటారు. వాళ్ల బాధ కూడా అదే.. అస్సలు నేను ఎక్కువగా ఏం తినడం లేదు అయినా ఎందుకు వారం వారానికే ఎంత వెయిట్ గెయిన్ అవుతున్నాను అని. అవును ఎందుకు..? తినకపోయినా ఎందుకు బరువు పెరుగుతారు..? మీ ఆహారంలో కొన్నింటిని చేర్చుకోవడం ద్వారా కొద్ది రోజుల్లోనే మీ అధిక కొవ్వును కట్ చేసుకోవచ్చు.

### దాల్చిన చెక్క :

పొట్టలోని కొవ్వును తగ్గించుకోవడానికి దాల్చిన చెక్కను మీ ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు. ఇందుకోసం దాల్చిన చెక్కను నీటిలో నానబెట్టి భోజనం తర్వాత ఈ నీటిని తాగాలి. దాల్చిన చెక్కలో మంచి మొత్తంలో పీచు ఉంటుంది. ఇది ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతుంది. మరేదైనా తినకుండా ఉంటారు.

### అవిసె గింజలు :

అవిసె గింజలను తీసుకోవడం ద్వారా మీరు పొట్ట కొవ్వును తగ్గించుకోవచ్చు. అవిసె గింజలలో పెద్ద మొత్తంలో కరిగే ఫైబర్ ఉంటుంది, ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది. దీని వల్ల చాలా సేపు కడుపు నిండినట్లు అనిపిస్తుంది మరియు త్వరగా ఆకలి వేయదు.

### యాపిల్ సైడర్ వెనిగర్ :

యాపిల్ సైడర్ వెనిగర్ బెల్లీ ఫ్యాట్‌ని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా యాపిల్ సైడర్ వెనిగర్ మిక్స్ చేసి, భోజనానికి ముందు తాగితే బెల్లీ ఫ్యాట్ త్వరగా తగ్గుతుంది. మీకు కావాలంటే మీరు మీ సలాడ్‌లో ఆపిల్ సైడర్ వెనిగర్‌ను కూడా జోడించవచ్చు.

### మెంతి గింజలు :

బెల్లీ ఫ్యాట్‌ని తగ్గించడంలో మెంతులు కూడా మంచి పాత్ర పోషిస్తాయి. దీని కోసం, ఒక టీస్పూన్ మెంతి గింజలను ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. దీన్ని ఫిల్టర్ చేసి ఉదయం ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగండి. ఇలా చేయడం వల్ల తక్కువ సమయంలోనే ఉత్తమ ఫలితాలను పొందవచ్చు.

### డ్రై ఫ్రూట్స్ :

బెల్లీ ఫ్యాట్ తగ్గించుకోవడానికి డ్రై ఫ్రూట్స్‌ను బ్రేక్ ఫాస్ట్ గా తీసుకోవచ్చు. అయితే మీరు ఈ డ్రై ఫ్రూట్స్‌ని రాత్రంతా నీటిలో నానబెట్టి, తర్వాత మాత్రమే తినాలి. పరిశోధన ప్రకారం, మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు మరియు ఒమేగా –3 కొవ్వు ఆమ్లాలు వంటి మంచి కొవ్వులు అధికంగా ఉండే ఆహారాలు బొడ్డు కొవ్వును తగ్గించడంలో సహాయపడతాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com